



ఆలయ సందర్శన.. వినతుల » స్వీకరణ

మంత్రి లోకేశ్ గురువారం ఉదయం సింహాచలం అప్పన్నను దర్శించుకున్నారు. మంత్రికి ఆలయ అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామి దర్శనం అనంతరం కప్పస్తంభాన్ని లోకేశ్ ఆలింగనం చేసుకున్నారు. ఆ తరువాత తెదేపా కార్యాలయానికి వెళ్లారు. అక్కడి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల బాధలు ఆలకించారు. వారి వినతులు స్వీకరించారు. –న్యూస్‌టుడే, సింహాచలం, వన్‌టౌన్

ఈనాడు
విశాఖపట్నం

అందాల లోకం... తిలకిస్తే స్వర్గం!!





ఆహ్లాదంగా పర్యాటక హోటళ్లు..


జిల్లాలో ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ హోటళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. గతంలో 304 గదులుండేవి. రుషికొండపై కూల్చివేతల తర్వాత ఆ సంఖ్య 249కి పడిపోయింది. విశాఖ డివిజన్ ఆధ్వర్యంలో పర్యాటక ప్యాకేజీలు నిర్వహిస్తుండగా కొన్నింటికి మంచి డిమాండు ఉంటోంది. కొత్త బస్సులు, కార్లు ఏర్పాటు చేస్తే వీటికి మరింత స్పందన రానుంది.



'గమ్య నగరం'గా పర్యాటకుల మనసుదోచుకున్న విశాఖలో చూడదగ్గ ప్రాంతాలెన్నో.

విశాఖ సాగర తీరం... ప్రాచీన కట్టడాలు... నవీన నిర్మాణాలు... హరితశోభ సంతరించుకున్న సహజసిద్ధ కొండలు... బీచ్ రోడ్డులో సబ్‌మెరైన్, యుద్ధ విమానాలు... ఇలా చెప్పుకుంటూ వెళ్తే ఎన్నో. వీటి ఆధారంగా ఆతిథ్య, రవాణా రంగాలు కొన్ని వేల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి.

'కూటమి' ప్రభుత్వం పర్యాటక రంగంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న నేపథ్యంలో మరిన్ని సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం నేపథ్యంలో 'ఉమ్మడి విశాఖ'లో ప్రత్యేకతలేంటో చూద్దామా.



గత వైకాపా ప్రభుత్వ హయాంలో పర్యాటకరంగం కుదేలైంది. రుషికొండ హిల్ రిసార్టు కూల్చేయడంతో ఆ శాఖపై తీవ్ర ప్రభావం కనిపించింది. పర్యాటక ఉత్సవాల నిర్వహణ చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక పర్యాటక అనుబంధ రంగాలకు ఊపిరివచ్చినట్లయింది. ప్రభుత్వ విధానాల వల్ల క్రమేణ అన్ని రంగాలు పుంజుకుంటున్నాయి. పర్యాటక ప్రదేశాలకు వస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. కేంద్రం సహకారంతో కొత్తగా బొర్రాను అభివృద్ధి చేయనున్నారు. అరకు-లంబసింగి కారిడార్ పేరుతో బృహత్తర ప్రణాళిక పట్టాలెక్కనుంది.

10వ పేజీలో



ఆశాజనకంగా: విశాఖకు వచ్చే సందర్శకుల సంఖ్య క్రమేణ పెరుగుతోంది. పర్యాటకం ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు పెంచితే ఎంతో మార్పు కనిపిస్తుంది. చేతివృత్తులు, ఆహార వంటకాల ద్వారా ప్రోత్సహించొచ్చు. గ్రామీణ ప్రాంతాలను పర్యాటకానికి అనుసంధానం చేయాలి. వారసత్వ ప్రదేశాలను విదేశీయులకు పరిచయం చేయాలి. ఇప్పుడిప్పుడే ఈ రంగం పుంజుకుంటోంది. భవిష్యత్తు ఆశాజనకంగా ఉండనుంది.

– ఎం.వి.పవన్‌కార్తిక్, ఏపీ పర్యాటక సమాఖ్య కార్యదర్శి



నేడు పర్యాటక ప్రాంతాల్లో ఉచిత ప్రవేశం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని వి.ఎం.ఆర్.డి.ఎ. ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు పర్యాటక ప్రాంతాల్లో ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు వి.ఎం.ఆర్.డి.ఎ. కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. శుక్రవారం వుడా పార్కు, కైలాసగిరి, డాక్టర్ వై.ఎస్.ఆర్ సెంట్రల్ పార్కు, తెలుగు మ్యూజియం, సబ్‌మెరైన్, టి.యు. 142, సీ హారియర్ మ్యూజియం తదితర సందర్శన ప్రాంతాల్లో ప్రవేశం ఉచితమన్నారు. ఈ అవకాశాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నగరంలో 'ఈనాడు'

★ నిరుద్యోగ యువతకు ఉద్యోగ మేళా శుక్రవారం ఉదయం పది గంటలకు ప్రభుత్వ పాత ఐటీఐ పక్కన గల నేషనల్ కెరీర్ సర్వీసు సెంటరులో నిర్వహిస్తున్నట్లు సబ్‌రీజనల్ ఎంప్లాయిమెంటు అధికారి ఎస్.శ్యామ్‌సుందర్ తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ ఎం, బి,డి, చేసిన అభ్యర్థులు అర్హులన్నారు.
– న్యూస్‌టుడే, కంచరపాలెం

★ రాష్ట్రస్థాయి టేబుల్‌టెన్నిస్ పోటీలు గీతం వర్సిటీ వేదికగా శుక్రవారం నుంచి జరగనున్నాయి. అండర్-11, 12, 15, 17, 19 విభాగాలతో పాటు పురుషులకు, మహిళలకు పోటీలు జరుగుతాయి. గీతం వర్సిటీ పూర్తి స్థాయి సహాయ సహకారాలు అందిస్తున్నట్లు ఏ.పి. టేబుల్ టెన్నిస్ సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ డి.వి.ఎస్.వై.శర్మ తెలిపారు.
– న్యూస్‌టుడే, విశాఖ క్రీడలు

★ సాయంత్రం 6.30 గంటలకు పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో మూడురోజుల పాటు కొనసాగే వైశాఖి నృత్యోత్సవాలు ప్రారంభమవుతాయి.
– న్యూస్‌టుడే, మద్దిలపాలెం

★ ఆంధ్రవిశ్వవిద్యాలయం భూ విజ్ఞానశాస్త్రం ఆధ్వర్యంలో కెమిస్ట్రీ విభాగం సెమినార్ హాల్‌లో రెండు రోజుల పాటు జరిగే జాతీయ స్థాయి కార్యశాల శుక్రవారం ప్రారంభమవుతుంది. **– న్యూస్‌టుడే, ఏయూ ప్రాంగణం**

కరోనాలో పన్నులు వేసిన అధికారికి మళ్లీ పోస్టింగ్

డీపీఓలపై విచారణ జరపాలి


మాట్లాడుతున్న రాపర్తి కన్నా

కార్పొరేషన్, న్యూస్‌టుడే: కరోనా విలయ తాండవం చేసినప్పుడు, కార్యాలయాలన్నీ మూసేసినా, అధికారులెవరూ పనిచేయక పోయినా 700 ఆస్తులకు పన్నులు విధించిన పొందూరు సింహాచలం అనే అధికారికి మళ్లీ జీవీఎంసీలో పోస్టింగ్ ఇచ్చారని ఆయన చేసిన అక్రమాలపై విచారణ జరపాలని 93వ వార్డు కార్పొరేటర్ రాపర్తి త్రివేణి వరప్రసాదరావు (కన్నా) పేర్కొన్నారు. కౌన్సిల్ సమావేశంలో డేటా ఎంట్రీ ఆపరేటర్లు, డేటా ప్రోసెసింగ్ ఆపరేటర్లను ఏడాదిపాటు కొనసాగించే అంశంపై ఆయన మాట్లాడారు. డేటా ప్రోసెసింగ్ ఆపరేటర్లను ఈఆర్‌పీ (ఎంటర్‌ప్రైజస్ రిసోర్స్ ప్లానింగ్) సాఫ్ట్‌వేర్ పరిచయం చేసినప్పుడు, ఇక్కడ సిబ్బందికి శిక్షణ ఇవ్వడానికి ప్రయివేటు సంస్థ వారికి అప్పగించిందని, వారి గడువు ముగిసినా, ఏళ్ల తరబడి ఇక్కడే కొనసాగుతున్నారని ఆయన పేర్కొన్నారు. జెడ్సీల వద్దనే ఉంటూ అక్రమంగా పట్టాల్లేని ఆస్తులకు పన్నులు విధిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. దీనిపై మూడేళ్ల క్రితం ఆధారాలతోపాటు, ఫిర్యాదు చేసినా, నేటికీ చర్యల్లేవని కమిషనర్‌కు తెలిపారు. విచారణలో భాగంగా రెవెన్యూ, దేవస్థానం, రిజిస్ట్రేషన్ అధికారులు హాజరుకావాలని కోరినా, వారు రావడంలేదంటూ కమిషనర్ సమాధానం ఇవ్వగా, ఆస్తి పన్ను విధించింది జెడ్సీలు, సిబ్బంది అయితే వారితో మీకేం పనంటూ ఆయన ప్రశ్నించారు. త్వరగా విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

స్టీల్‌ప్లాంటుపై తీర్మానం: స్టీల్ ప్లాంటు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా అఖిలపక్షాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఉక్కు శాఖ మంత్రిని కలవడానికి తీర్మానించాలని, చెత్త ఛార్జీల రద్దు, ఆస్తి పన్ను విధింపు ఆస్తి విలువలో 0.13శాతం నుంచి 0.10శాతానికి తగ్గించాలని కోరుతూ సీపీఎం కార్పొరేటర్ గంగారావు, సీపీఐ కార్పొరేటర్ స్టాలిన్, వైకాపా ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు మేయరును కోరారు. ఆయా అంశాలను టేబుల్ అజెండాగా రూపొందించాలని కోరారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెత్త ఛార్జీలు వసూలు చేయవద్దని పేర్కొన్నారని, ఆయనకు ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానం చేయాలని కూటమి కార్పొరేటర్లు ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, నొల్లి నూకరత్న, గల్లా చిన్నా, శరగడం రాజశేఖర్, గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, లేళ్ల కోటేశ్వరరావు, కాకి గోవిందరెడ్డి డిమాండ్ చేశారు. చెత్త పన్ను, ఆస్తి పన్ను మినహాయించి, మిగతా అంశంపై అజెండా తయారు చేసిన మేయరు 97 మంది కార్పొరేటర్ల అభ్యర్థన మేరకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, స్టీల్ మంత్రిని కలవడానికి కోరుతున్నట్లు అజెండాలో పొందుపరిచి, దానిని ఆమోదించారు. బీచ్‌రోడ్డులో సౌర విద్యుత్తు దీపాల నిర్వహణకు రూ.1.06కోట్లు వ్యయం చేయడంపై తెదేపా కార్పొరేటర్లు అభ్యంతరం వ్యక్తం చేయగా, వాటి ఆవశ్యకతను 9వ వార్డు కార్పొరేటర్ స్వాతిదాసు తెలిపారు. ★ జీవీఎస్‌సీసీఎల్ నిర్మిస్తున్న భవనానికి కిటికీలు, తలుపులు తదితరాల ఏర్పాటుకు రూ.1.20 కోట్లతో పనులు ప్రతిపాదించగా, ఆ భవనాన్ని ఎన్నికల ముందు ప్రారంభించారా లేదా అన్న సభ్యుల ప్రశ్నకు అధికారులు వాస్తవాలను తెలియజేయలేదు. అప్పటి విద్యాశాఖ మంత్రి బొత్స దానిని వినియోగించినట్లు కూటమి కార్పొరేటర్లు తెలిపారు. పాలకవర్గానికి తెలియకుండా ఇష్టానుసారంగా వ్యవహరించడం సరికాదని అధికారులను హెచ్చరించారు. జీవీఎంసీ నీటి సరఫరా కార్మికులకు వేతనాలు పెంచాలని కార్పొరేటర్లు గంకల కవిత, బీశెట్టి వసంతలక్ష్మి కోరారు.

కార్పొరేటర్లందరికీ అవకాశం

జీవీఎంసీలో మూడున్నరేళ్ల తరువాత కార్పొరేటర్లందరికీ మాట్లాడే అవకాశం కల్పించామని తెదేపా ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జీవీఎంసీ ఆస్తుల ప్రారంభ కార్యక్రమం మేయరుకు కూడా తెలియకుండా చేశారని కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు తెలిపారు. జి-20లో భారీగా అవినీతి జరిగిందని, స్టీల్ పరిరక్షణకు రూ.3వేల కోట్లు కేంద్రం విడుదల చేసిందన్నారు.

కనకమ్మ సన్నిధిలో మహా శాంతి హోమం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: పాతనగరంలోని బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో గురువారం మహా శాంతి హోమం నిర్వహించారు. తిరుమల శ్రీవారి లడ్డు తయారీలో నాసిరకం నెయ్యి వాడకం వల్ల అపవిత్రమైన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన ఆలయాల్లో మహా శాంతి హోమాలు జరిపించాలని దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు కనకమహాలక్ష్మి ఆలయ అర్చకులు, వేదపండితుల సమక్షంలో మహాశాంతి హోమాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ముందుగా గణపతి హోమం, పుణ్యాహ వచనం, మండపరాధన, మండపాహవనం, పంచసూక్త హవనం పూజలు జరిపించారు. అనంతరం దేవాలయ ప్రాంగణం, ప్రసాదశాల, అమ్మవారి నివేదనశాలను సంప్రోక్షణ చేశారు.


శాంతి హోమంలో పాల్గొన్న ఆలయ అర్చకులు, అధికారులు

ఓటరు జాబితాల సవరణ పక్కాగా జరపాలి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, చిత్రంలో డీఆర్వో మోహన్‌కుమార్, జేసీ మయూర్ అశోక్

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఓటర్ల జాబితాల సవరణ, పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని, గత తప్పులు పునరావృతం కాకుండా జాగ్రత్త వహించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సూచించారు. ప్రత్యేక ఓటరు జాబితా-2024పై కలెక్టరేట్‌లో గురువారం సాయంత్రం అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. నిబంధనల ప్రకారం ఈనెల 28వ తేదీలోగా అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించిన ఓటర్ల జాబితా రూపకల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్వో కె.మోహన్‌కుమార్, ఆర్డీఓలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్‌రెడ్డి, ప్రత్యేక ఉప కలెక్టర్లు సీతారామ్మూర్తి, అఖిల, లక్ష్మారెడ్డి, శేషశైలజ, వివిధ మండల తహసీల్దార్లు, ఎన్నికల విభాగ డీటీలు పాల్గొన్నారు.

సామాజిక స్ఫూర్తితో ముందడుగు : కలెక్టర్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, చిత్రంలో కోరమాండల్ సంస్థ ప్రతినిధులు

గాజువాక, న్యూస్‌టుడే: విద్య వికాసానికి పరిశ్రమల యజమానులు, పారిశ్రామికవేత్తలు సామాజిక స్ఫూర్తితో సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం గాజువాక స్టీల్‌సిటీ ప్రభుత్వ మోడల్ ఐటీఐలో సీఎస్సార్‌లో భాగంగా కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ రూ.36 లక్షలతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. కోరమాండల్ వైస్ ప్రెసిడెంట్ ఎం.జ్ఞానసుందరం మాట్లాడుతూ... విద్యార్థుల అవసరాలను గుర్తించి ల్యాబ్ ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఐటీఐ వసతి గృహ విద్యార్థులకు మురుగప్ప గ్రూపు తరపున రగ్గులు, దుప్పట్లు అందజేశారు. ఐటీఐ ప్రిన్సిపల్ కె.ఎస్.శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, ఐటీఐ కమిటీ ఛైర్మన్ ఏకే బాలాజీ, సంస్థ సీఎస్సార్ హెడ్స్ జయగోపాల్, శ్రీనివాసరావు, ఐటీఐ ఆర్‌డీడీ ఆర్వీ రమణ, 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు పాల్గొన్నారు.

ప్రమాదంపై విచారణ కమిటీ ఏర్పాటు

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు–3), న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు కర్మాగారం ఎస్ఎంఎస్-1లో జరిగిన అగ్ని ప్రమాద ఘటనపై ఐదుగురు సభ్యులతో కూడిన విచారణ కమిటీ ఏర్పాటైంది. పీపీఎం విభాగాధిపతి శంకర్‌జీ, ఎస్ఎంఎస్-1కు చెందిన ఆర్పీసింగ్, ఎస్ఎంఎస్-2కు చెందిన శశికాంత్, భద్రతా విభాగం నుంచి ఎం.వరప్రసాద్, క్యూఏ విభాగం నుంచి అప్పారావు సభ్యులుగా ఉన్నారు. 28 నాటికి నివేదిక అందజేయాలని ప్లాంట్ చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం) ఆర్.మొహంతి ఆదేశించారు. ఇంటక్, సిటూ కార్మిక సంఘాల డిమాండ్ మేరకు యాజమాన్యం కమిటీ ఏర్పాటు చేసింది.

కుండపోత.. పిడుగుల మోత


జ్ఞానాపురం వంతెన వద్ద నిలిచిన నీటిలో..

ఈనాడు డిజిటల్, విశాఖపట్నం: విశాఖ నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం నుంచి మేఘాలు కమ్ముకుని, చిరుజల్లులు పడ్డాయి. మధ్యాహ్నం ఒక్కసారిగా పిడుగుల మోతతో నగరం దద్దరిల్లింది. జిల్లావ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. అకస్మాత్తుగా భారీ వర్షం కురవడంతో చిరువ్యాపారులు అవస్థలు పడ్డారు. రాబోయే మూడు రోజుల్లో జిల్లాలో పలు చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురవొచ్చని వాతావరణశాఖ అంచనా వేస్తోంది. గురువారం ఉదయం నుంచి రాత్రి 7 గంటల వరకు నమోదైన వర్షపాతం (మిల్లీమీటర్లలో): ★ సీతమ్మధార: 47 ★ రైల్వే న్యూకాలనీ: 37.25 ★ ఆరిలోవ: 32.75 ★ పెందుర్తి 30 ★ మహారాణిపేట: 28.5 ★ మధురవాడ: 28 ★ ఎండాడ: 25 ★ గోపాలపట్నం: 24 ★ కాపులుప్పాడ: 21.25 ★ మారికవలస: 20.5

మేహాద్రి రిజర్వాయర్ గేటు ఎత్తివేత


గేటు ఎత్తి కిందకు విడిచిపెడుతున్న నీరు

వేపగుంట, న్యూస్‌టుడే: గత కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తుండటంతో మేహాద్రి రిజర్వాయర్‌లో నీటి మట్టం పెరుగుతుండటంతో రిజర్వాయర్ పర్యవేక్షణ అధికారులు ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా గేటు ఎత్తుతూ నీటిని కిందికి విడిచిపెడుతున్నారు. ఇప్పటివరకు రెండు పర్యాయాలు మూడు అంగుళాల మేర గేటు ఎత్తి నీటిని వదలగా గురువారం నీటిమట్టం మరింత ఎక్కువ కావడంతో ఆరు అంగుళాల మేర రెండో నంబరు గేటు ఎత్తి 350 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. అధికారుల పర్యవేక్షణలో ముందుగా అలారం మోగించి పల్లపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి గేటు ఎత్తారు. రిజర్వాయర్ గరిష్ఠ నీటి మట్టం 61 అడుగులు కాగా ప్రస్తుతం 59.5 అడుగులకు నీరు చేరింది. 59.3 అడుగులకు తగ్గిన తర్వాత గేటు మూయడం జరుగుతుందని అధికారులు ఈఈ ఎ.త్రినాథం, ఏఈ పి.నళిని, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు సుబ్బరాజు తెలిపారు.

ముంచెత్తిన వాన


నీట మునిగిన ఐఓసీ టెర్మినల్ రోడ్డు


రిఫైనరీ ప్రాజెక్టు గేటు వద్ద..

సింధియా, న్యూస్‌టుడే : అల్పపీడనం ప్రభావంతో గురువారం కురిసిన భారీ వర్షానికి విశాఖపట్నం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ టెర్మినల్ రోడ్డు, హెచ్‌పీసీఎల్ రిఫైనరీ విస్తరణ ప్రాజెక్టు ప్రధాన గేటు పరిసరాలు పూర్తిగా ముంపునకు గురయ్యాయి.

తూర్పు నౌకాదళం సందర్శన


యుద్ధనౌకపై శిక్షణ పోలీసులు, నేవీ అధికారులు

సింధియా, న్యూస్‌టుడే : ఈశాన్య రాష్ట్రం మేఘాలయకు చెందిన శిక్షణ పోలీసుల బృందం గురువారం విశాఖలోని తూర్పు నౌకాదళం కార్యాలయాన్ని సందర్శించిందని నేవీ వర్గాలు తెలిపాయి. సముద్ర సంబంధిత సవాళ్లు, చేపడుతున్న ఆపరేషన్లు, జలాంతర్గాములు, యుద్ధనౌకల్లో వినియోగించే సాంకేతిక పరిజ్ఞానంపై ఏపీ నేవల్ అధికారి వివరించారు. మొత్తం 15 మంది శిక్షణ పోలీసులు హాజరయ్యారు.

నగరంలో సాంస్కృతిక వారసత్వపు నడక



టౌన్‌హాలు వద్ద పర్యాటక మండలి సభ్యులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని జిల్లాలోని చారిత్రక ప్రదేశాలు, కట్టడాల ప్రాశస్త్యాన్ని, విశిష్టతను తెలియజేసేందుకు గురువారం పర్యాటక మండలి సభ్యులు, అధికారులు సాంస్కృతిక వారసత్వపు నడక(హెరిటేజ్ వాక్) నిర్వహించారు. గురువారం ఉదయం పాతనగరంలోని టౌన్‌హాలు నుంచి నడక ప్రారంభించారు. చారిత్రక ప్రదేశాల ప్రాధాన్యతను గుర్తించి గౌరవించాలని ర్యాలీలో నినదించారు. ఈ సందర్భంగా ప్రపంచ పర్యాటక దినోత్సవ గోడపత్రికలు విడుదల చేశారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ ప్రాంతీయ సంచాలకులు శ్రీనివాస ఫణి, జిల్లా పర్యాటక శాఖ అధికారి జ్ఞానవేణి, ఏపీటీడీసీ ఈఈ రమణ, కౌన్సెల్ సభ్యులు పాల్గొన్నారు.

తాను చనిపోయి.. మరికొందరికి జీవితాన్నిచ్చి..


సంతోష్ (పాతచిత్రం)

పెదవాల్తేరు, విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : ఓ వ్యక్తి మరణిస్తూ మరో ఇద్దరికి కొత్త జీవితం ప్రసాదించాడు. దీనికి సంబంధించి వివరాలు ఉన్నాయి. అనకాపల్లి జిల్లా రావికమతం మండలం, కొత్తకోట గ్రామానికి చెందిన బి.సంతోష్ (35) తీవ్రమైన తలనొప్పితో ఈనెల 22న రామ్‌నగర్ సెవెన్‌హిల్స్ ఆసుపత్రిలో చేరాడు. తలలో అధికంగా రక్తస్రావం జరిగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. బుధవారం రాత్రి వరకు వైద్యం అందించినా ఫలితం లేకపోవడంతో బ్రెయిన్‌డెడ్‌గా వైద్యులు నిర్ధారించారు. అవయవదాన సభ్యులు సంతోష్ తండ్రి సత్తిబాబు, సోదరుడు రామకృష్ణకు అవగాహన కల్పించగా.. వారు అవయవదానానికి ఒప్పుకున్నారు. దీంతో హైదరాబాద్ కిమ్స్‌కు ఊపిరితిత్తులు, కేర్ ఆసుపత్రికి కాలేయం కేటాయించి తరలించారు.

ఫైనల్స్‌లో తూ.కో.రైల్వే బాక్సర్ శ్యామ్‌కుమార్


శ్యామ్‌కుమార్ విజయం సాధించినట్లు ప్రకటిస్తున్న రిఫరీ

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: అఖిలభారత అంతర్ రైల్వే బాక్సింగ్ పోటీలు మూడో రోజు రైల్వే శ్రీనివాస కళ్యాణమండపంలో ఉత్కంఠంగా సాగాయి. తూర్పుకోస్తా రైల్వే క్రీడాకారుడు కె.శ్యామ్‌కుమార్ 5-0తో సెంట్రల్ రైల్వే క్రీడాకారుడు సహన్షాపై విజయం సాధించి ఫైనల్స్‌లోకి ప్రవేశించాడు. గతంలో శ్యామ్‌కుమార్ పలు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పతకాలు గెలుపొందాడు. శ్యామ్‌కు పతకం ఖాయమవ్వడం పట్ల విశాఖ బాక్సర్లలో ఆనందోత్సాహాలు మిన్నంటాయి.

సినర్జిన్ ప్రమాదంపై ఉన్నత స్థాయి కమిటీ ఆరా


రాంకీ కమర్షియల్ హబ్‌లో సమావేశమైన ఉన్నత స్థాయి కమిటీ సభ్యులు, చిత్రంలో అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్

పరవాడ, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా పరవాడ జేఎన్ ఫార్మాసిటీలోని సినర్జిన్ ఫార్మా పరిశ్రమలో గతనెల 23న జరిగిన ప్రమాదం ఘటనపై గురువారం ఉన్నత స్థాయి కమిటీ బృందం ఆరా తీసింది. కంపెనీలోని రియాక్టర్ వద్ద జరిగిన ప్రమాదంలో విజయనగరం జిల్లాకు చెందిన కెమిస్టు కె.సూర్యనారాయణతో పాటు ఝార్ఖండ్‌కు చెందిన ఒయబోం కొర్వ, లాల్ సింగ్‌పూర్తి, రొయా అంగిరియా మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రమాద కారణాలను విశ్లేషణ చేయడానికి ప్రభుత్వం విశ్రాంత ఐఏఎస్ అధికారిణి వసుధ మిశ్రా ఛైర్మన్‌గా వివిధ శాఖల అధికారులు, నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసింది. వారంతా మధ్యాహ్నం 3.30 గంటలకు సినర్జిన్ ఫార్మాకు చేరుకుని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం జరగడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాంకీ కమర్షియల్ హబ్‌లోని సమావేశ మందిరంలో యాజమాన్య ప్రతినిధులు, అధికారులతో సమావేశమయ్యారు. యాజమాన్యాలు కార్మికుల భద్రతకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్, డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ చంద్రశేఖర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఉక్కు అధికారి మృతి


సీహెచ్.మల్లేశ్వరరావు (పాతచిత్రం)

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు–3), న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు కర్మాగారం స్టీల్ మెల్టింగ్ షాప్(ఎస్ఎంఎస్)-1 ఎల్‌పీ బేలో మంగళవారం జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఉక్కు అధికారి సీహెచ్.మల్లేశ్వరరావు(54) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. 1992 ఫిబ్రవరిలో సీనియర్ ట్రైనీగా ఉద్యోగ జీవితం ప్రారంభించిన ఆయన... అంచెలంచెలుగా ఎదిగి సీనియర్ మేనేజర్ స్థాయికి చేరుకున్నారు. గాజువాక హైస్కూల్ రోడ్డు జోగవానిపాలెంలో నివాసం ఉంటున్న ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన స్వస్థలం ఉమ్మడి కృష్ణ జిల్లా అనిగళ్లపాడు.

వేధింపులకు పాల్పడుతున్న యువకుడిపై కేసు నమోదు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : బాలికను వేధిస్తున్న వ్యక్తిపై మూడో పట్టణ పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మురళీనగర్ ప్రాంతానికి చెందిన బాలిక (17) కాంప్లెక్స్ వద్ద ఓ కార్పొరేట్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఆమెతో కలిసి చదువుకున్న ఓ యువకుడు తనను ప్రేమించాలని వేధింపులకు పాల్పడుతున్నాడు. ఆ విద్యార్థిని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సి.ఐ. రమణయ్య ఆ యువకునిపై వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు
(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	107	98
లైవ్	129	118
డ్రెస్డ్	187	206
స్కిన్‌లెస్	213	216

తెరపై ఈనాడు
పెందుర్తిలో..
లక్ష్మీకాంత్
స్క్రీన్-1 - దేవర (5 ఆటలు)
స్క్రీన్-2 - దేవర (5 ఆటలు)



మర్యాద పూర్వక కలయిక

పెందుర్తి, న్యూస్‌టుడే: విశాఖ పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. పర్యటన అనంతరం తిరుగు ప్రయాణంలో విమానాశ్రయంలో లోకేశ్‌ను కలిసి శాలువతో సత్కరించారు.

పెందుర్తి

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
పెందుర్తి : 90598 98721 వేపగుంట: 93472 79909

– న్యూస్‌టుడే, చినముషిడివాడ (పెందుర్తి)

సమస్య: జీవీఎంసీ 97వ వార్డు పరిధి చినముషిడివాడ శ్రమశక్తినగర్‌లో 12బి/1/7, 12బి/1/8, 12బి/1/9, చినముషిడివాడ క్రాంతినగర్‌లో 7ఎ/12, సిద్ధార్థనగర్‌లో 354బి/4 స్తంభాలకు ఉన్న ఉన్న వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో కాలనీల్లో అంధకారం నెలకొంటోంది.
– జాహ్నవి, శ్రమశక్తినగర్, వెంకటరమణమ్మ, క్రాంతినగర్, ఎస్.వెంకటరమణ, సిద్ధార్థనగర్

సమాధానం: మీ ప్రాంతాల్లో వెలగని వీధి దీపాలకు త్వరలోనే మరమ్మతు చేయించి వెలిగేలా చర్యలు తీసుకుంటాం.
– శివ రామ్‌ప్రసాద్, ఏఈ, 97వ వార్డు

సమస్య: సబ్బవరం సాయినగర్ నుంచి కళాకారుల కాలనీకి వెళ్లే రహదారి దారుణంగా ఉంది. కాలనీ ఏర్పడి 30 ఏళ్లు అవుతున్నా నేటికీ రోడ్డు నిర్మించలేదు. వర్షాకాలంలో బురదతో నానా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి రహదారి నిర్మించాలి.
– ఎం.సూరిబాబు, కళాకారుల కాలనీ

సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. రహదారి నిర్మాణానికి చర్యలు చేపడతాం.
– డి.ప్రసాదరావు, సర్పంచి, సబ్బవరం

అందుబాటులోకి కల్యాణ మండపం



నరవలోని కల్యాణ మండపం

నరవ(వేపగుంట), న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వాత పంచాయతీ పాలనను పక్కకు పెట్టి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. సచివాలయాల కోసం కల్యాణ మండపాలు, సామాజిక భవనాలను వినియోగించుకున్నారు. దీంతో ప్రజలు శుభకార్యాలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం గెలవడంతో ప్రజల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరిస్తున్నారు. శుభ కార్యక్రమాలకు దూరమైన నరవ కల్యాణ మండపం ఎట్టకేలకు మళ్లీ ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు చొరవతో కల్యాణ మండపంలో ఉన్న సచివాలయాన్ని గురువారం అద్దె భవనంలోకి మార్చి కల్యాణ మండపాన్ని ప్రజలకు అంకితం చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన సచివాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారు. నరవతో పాటు సుమారు మరో 10 గ్రామాల ప్రజలు ఈ కల్యాణ మండపాన్ని వినియోగించుకునేవారు. స్థానికులు, వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు ఎన్నిమార్లు వ్యతిరేకించినా దాన్ని మార్చలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత స్థానిక నాయకులు ఎమ్మెల్యే పంచకర్ల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. వెంటనే సచివాలయాన్ని వేరొక భవనంలోకి మార్చి కల్యాణ మండపాన్ని ప్రజలకు అందజేయాలని జీవీఎంసీ కమిషనరుకు సూచించారు. ఎమ్మెల్యే సూచనలతో కమిషనరు చర్యలు తీసుకున్నారు. ఎట్టకేలకు కల్యాణ మండపానికి పట్టిన గ్రహణం వీడటంతో కూటమి నాయకులు, నరవ ప్రజలు సంబరాలు చేసుకున్నారు. అదేవిధంగా నరవ పాత పంచాయతీ భవనం ఉన్న స్థలంలో శాశ్వత సచివాలయం భవనం నిర్మించే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.

చేయి చేయి కలిపారు...
విరాళాలు సేకరించారు..

వేపగుంట, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన వర్షాలకు బుడమేరు పొంగి విజయవాడ ముంపునకు గురై సర్వం కోల్పోయిన బాధితులకు సహాయం చేయడంలో మేముసైతం అంటూ ముందుకొచ్చారు జీవీఎంసీ జోన్-8 పరిధిలోని 94వ వార్డు డ్వాక్రా సంఘాల మహిళలు. తమవంతు సాయం అందించడంతో పాటు ఇరుగుపొరుగు వారితో కూడా సాయం అందించేలా చేశారు. ఇంటింటికీ తిరిగి విరాళాలు సేకరించి తమలోని మానవత్వాన్ని చాటుకున్నారు. 94వ వార్డు జనసేన అధ్యక్షురాలు పిన్నింటి పార్వతి, హేమలక్ష్మి, నామాలా అరుణ విరాళాలు సేకరించి వరద బాధితులకు అందించాలని సంకల్పించారు. యూసీడీతో సంబంధం లేకుండా వీరు తమకు తెలిసిన మహిళలు అందరికీ ఈ విషయాన్ని చరవాణి ద్వారా సందేశం పంపించారు. వెంటనే మహిళలు స్పందించి ఎవరికి తోచిన సహాయాన్ని వారు అందించారు. ఖాళీ సమయాల్లో ఇళ్ల వద్దకు వెళ్లి నిధులు సేకరించారు. అలా కూడబెట్టిన మొత్తం రూ.1.66 లక్షలు సమకూరాయి. ఈ నగదును చెక్కుగా మార్చి గురువారం ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబుకు అందజేసి ముఖ్యమంత్రి సహాయనిధికి పంపించాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి బాధితులకు సహాయం చేయడానికి ముందుకొచ్చిన మహిళలందరినీ ఆయన అభినందించారు.



సేకరించిన విరాళాల చెక్కుతో డ్వాక్రా మహిళలు



తానాంలో అన్నసమారాధనను ప్రారంభిస్తున్న మాజీ జెడ్పీటీసీ జగన్నాథరావు, మాజీ ఏఎంసీ ఛైర్మన్ వెంకటరమణ

భారీ అన్నసమారాధనలు

పరవాడ, న్యూస్‌టుడే: వినాయక ఉత్సవాల్లో భాగంగా పరవాడ మండలం తానాంలో గురువారం రామాలయం యూత్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పైలా జగన్నాథరావు, అనకాపల్లి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు కన్నూరు వెంకటరమణ ప్రారంభించారు. స్థానికులు పెద్దఎత్తున చేరుకుని అన్నదానం స్వీకరించారు. వర్రి వసంతరావు, రామాలయం యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం గోపాల్‌నగర్‌లో భారీ అన్నసమారాధన జరిపారు. సీఐ పిన్నింటి రమణ భోజనాలు వడ్డించి అన్నసమారాధనను ప్రారంభించారు. పరిసర గ్రామాల నుంచి సుమారు 3 వేల మంది భక్తులు హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. స్థానిక నేతలు కోరాడ శ్రీనివాసరావు, పల్ల తాతారావు, పి.రమణ, కోన సోమేశ్వరరావు, కొయ్యి రమణ, పల్ల సన్యాసిరావు, నిర్వాహకులు పాల్గొన్నారు.



సబ్బవరం గోపాల్‌నగర్‌లో భోజనాలు వడ్డిస్తున్న సీఐ పిన్నింటి రమణ, నిర్వాహకులు

భక్తుల మనోభావాలను కాపాడేందుకే దీక్ష



సంఘీభావ దీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు, కూటమి నాయకులు

పురుషోత్తపురం(పెందుర్తి), న్యూస్‌టుడే: తిరుమలలో జరిగిన అపచారం నేపథ్యంలో భక్తుల మనోభావాలను కాపాడేందుకే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. పవన్‌కల్యాణ్ దీక్షకు మద్దతుగా జీవీఎంసీ 95వ వార్డు పురుషోత్తపురంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద స్థానిక జనసేన నాయకుడు ఉరిటి లక్ష్మీగోవింద్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంఘీభావ దీక్షలో పంచకర్ల పాల్గొన్నారు. కార్యక్రమంలో చీర రాజు, ఉరిటి శ్రీను, కల్యాణ్, బమ్మిడి త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలకు ఫ్యాన్లు వితరణ



ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌కు ఫ్యాన్లు అందిస్తున్న సొసైటీ ప్రతినిధులు

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు పెందుర్తి ప్రాంత కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ వెల్ఫేర్ సొసైటీ సీలింగ్ ఫ్యాన్లు వితరణ చేసింది. గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్‌కు అయిదు ఫ్యాన్లు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు జి.సత్యగణపతిరావు, ఆర్ఎస్.శేఖర్‌బాబు, జి.భాస్కర్, జి.మురళి, డీబీ.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రంగా మారేదెన్నడో..?



వెన్నెలపాలెంలో రైతు భరోసా కేంద్రం పేరుతో దర్శనమిస్తున్న భవనం

పరవాడ, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం కొలువు దీరి 100 రోజులు దాటింది. గత వైకాపా ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు(ఆర్బీకే) పేరును కూటమి ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలు(ఆర్ఎస్‌కే)గా మార్చింది. అయితే పరవాడ మండలంలోని వెన్నెలపాలెం, తానాం, నాయుడుపాలెం తదితర గ్రామాల్లోని భవనాలపైన పేర్లు ఇప్పటికీ రైతు భరోసా కేంద్రాలుగానే ఉండటం గమనార్హం. ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినా పేరు ఎందుకు మార్చలేదని పలువురు కూటమి నాయకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చాలని వారంతా కోరుతున్నారు.

ఆసుపత్రిలో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శ్రమదానం



శ్రమదానంలో పాల్గొన్న సబ్బవరం డిగ్రీ కళాశాల విద్యార్థులు

సబ్బవరం, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) విద్యార్థులు గురువారం సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శ్రమదానం చేశారు. ఆసుపత్రిలో పేరుకుపోయిన చెత్త, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త లెక్కల గణేశ్ మాట్లాడుతూ మన ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం అలవాటుగా మార్చుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను సమాజ బాధ్యతగా భావించినపుడే పరిశుభ్రమైన సమాజం ఏర్పడుతుందన్నారు.

భారీ వర్షం.. రహదారులు జలమయం

పెందుర్తి, వేపగుంట, పరవాడ, న్యూస్‌టుడే: అల్పపీడనం కారణంగా నగరంతో పాటు పెందుర్తి, పరవాడ మండలాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. సుమారు గంట పాటు కురిసిన వర్షానికి రహదారులు, పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాలు జలమయమై విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాఠశాలల్లో నాడు - నేడు పనులు అస్తవ్యస్తంగా చేపట్టడంతో వర్షపునీరు బయటకు పోయేందుకు తగిన మార్గాలు లేకుండా పోయాయి. వేపగుంట - గోశాల మార్గంలోని బీఆర్టీఎస్ రహదారిలో ఎగువ నుంచి వచ్చిన వరద నీరు పెద్దఎత్తున నిలిచిపోయింది. దీంతో వాహన చోదకులు రాకపోకలకు అవస్థలు పడ్డారు. వేపగుంట, నరవ జెడ్పీ పాఠశాలలు, 93వ వార్డు గొల్లనారాయణపురం, పల్లినారాయణపురం ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. భరణికం మొల్లోడు గెడ్డ, తానాం వాగు, ఫార్మాసిటీ తదితర ప్రాంతాల్లోని కాలువలు ఉద్ధృతంగా ప్రవహించాయి. ఫార్మాసిటీలోని అరబిందో పరిశ్రమ వద్ద, పరవాడ నుంచి లంకెలపాలెం వెళ్లే మార్గంలోని తిరుపతి ఫ్యూయల్స్ కంపెనీ వద్ద పెద్దఎత్తున నీరు నిలిచిపోవడంతో అటుగా పయనించడానికి వాహనచోదకులు నానా ఇబ్బందులు పడ్డారు. పరవాడ పెద్దచెరువు, ఊరచెరువు, స్వయంభూవరం, కలపాక, తానాంలోని తటాకాలు నీటితో నిండి కళకళలాడుతున్నాయి. వర్షానికి పలు గ్రామాల్లోని మట్టిరోడ్లు చిత్తడిగా మారాయి.



పల్లినారాయణపురం పాఠశాల ప్రాంగణంలో వరద



వేపగుంట - గోశాల బీఆర్టీఎస్ రహదారిలో నిలిచిన నీరు



పరవాడ - లంకెలపాలెం రహదారిలో..



అరబిందో కంపెనీ మార్గంలో స్తంభించిన వరద



ఉద్ధృతంగా ప్రవహిస్తున్న భరణికం మొల్లోడు గెడ్డ

అవీ.. ఇవీ

గుర్తు తెలియని వ్యక్తి ఆచూకీపై ఆరా



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి కూడలిలో గురువారం మధ్యాహ్నం ఓ గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో కేజీహెచ్‌లో చేర్చినట్లు ఎస్ఐ అసిరితాత తెలిపారు. సుమారు 50 ఏళ్ల వయసున్న వ్యక్తి పెందుర్తి కూడలిలో సంచరిస్తూ నీరసించి పడిపోయినట్లు తెలిపారు. కళ్లు సక్రమంగా కనిపించని ఇతనికి చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అతడి ఆచూకీ తెలిసిన వారు పెందుర్తి పోలీసులను సంప్రదించాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో ఫార్మా కార్మికుడి మృతి

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెలపాలెంలో గురువారం ఉదయం అనుమానాస్పద స్థితిలో ఫార్మా కార్మికుడు మృతి చెందాడు. దీనికి సంబంధించి పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన విశ్వజీత్ రభర్(25) గతకొంతకాలంగా ఫార్మాసిటీలో పని చేస్తూ తోటి కార్మికులతో కలిసి లంకెలపాలెం కూడలిలోని అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. గురువారం తెల్లవారుజామున విశ్వజీత్ రభర్ అనారోగ్యంగా ఉందని చెప్పి మాత్రలు తీసుకురమ్మని సోదరుడు సూరజ్ రభర్‌కు చెప్పడంతో వెంటనే మాత్రలు తీసుకురావడానికి దుకాణానికి వెళ్లాడు. అతను తిరిగి వచ్చేలోపు విశ్వజీత్ రభర్ కిందపడిపోయి ఉన్నాడు. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం అగనంపూడి సీహెచ్‌సీకి తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

చెట్ల కొమ్మల్లో విద్యుత్తు స్తంభాలు

నాయుడుతోట(వేపగుంట), న్యూస్‌టుడే: నాయుడుతోట దరి రవినగర్‌లోని నర్సింగ బిల్లమ్మ ఆలయ సమీపంలోని విద్యుత్తు స్తంభాలు చెట్ల పొదల మధ్యన ఉన్నాయి. దీంతో రాత్రుళ్లు వెలుగులు సక్రమంగా ప్రసరించడం లేదని స్థానికులు చెబుతున్నారు. విద్యుత్తు తీగలు కొమ్మలకు తాకడంతో తరచూ నిప్పురవ్వలు పడుతున్నాయని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురుస్తున్నందున ఇక్కడ ఉన్న రెండు విద్యుత్తు స్తంభాలతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి చెట్ల కొమ్మలను తొలగించాలని కోరుతున్నారు.





పాలనను గాడినపెట్టే పనిలో ప్రభుత్వం నిమగ్నం



పెందుర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, చిత్రంలో కూటమి నేతలు

పెందుర్తి, న్యూస్‌టుడే: అయిదేళ్ల పాటు అస్తవ్యస్తంగా సాగిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనను గాడిన పెట్టే పనిలో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నిమగ్నమైందని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పేర్కొన్నారు. జీవీఎంసీ 96వ వార్డు పరిధి పెందుర్తిలోని తాండ్ర పాపారాయుడు కల్యాణ మండపంలో గురువారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు ఎప్పుడూ ప్రజలకు జవాబుదారీగా ఉంటారన్నారు. జగన్ అయిదేళ్లు విచ్చలవిడి పాలన చేశారన్నారు. ఆస్తులు కొల్లగొట్టి, రౌడీయిజం చేసి అక్రమ కేసులతో ప్రతిపక్ష నేతలను వేధించారన్నారు. అనంతరం వంద రోజుల్లో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. జోన్-8 జెడ్సీ హేమవతి అందరితో సచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. భాజపా నియోజకవర్గం కన్వీనర్ గొర్లె రామునాయుడు, 96వ వార్డు తెదేపా, జనసేన అధ్యక్షులు వేగి పరమేశ్వరరావు, దాడి సంతోష్, జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు, నాయకులు పీలా జితేంద్ర, పెంటకోట రాజేంద్రప్రసాద్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవస్థానం భూ సమస్య పరిష్కారానికి కృషి

వేపగుంట, న్యూస్‌టుడే: సింహాచలం దేవస్థానం భూ సమస్య పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. వేపగుంట కూడలిలోని జీవీఎంసీ సామాజిక భవనంలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, దేవాదాయశాఖ మంత్రి, అధికారులతో సమావేశం నిర్వహించామన్నారు. మరికొద్ది రోజుల్లోనే ఈ సమస్యకు పరిష్కారం లభించనుందన్నారు. ఇటీవల విజయవాడ ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేసేందుకు వెళ్లిన కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గం ప్రత్యేక అధికారిణి శేషశైలజ, కార్పొరేటరు బల్ల శ్రీనివాసరావు, వార్డు జనసేన అధ్యక్షురాలు పిన్నింటి పార్వతి, జిల్లా తెదేపా మహిళా ఆర్గనైజింగ్ కార్యదర్శి శోభారాణి, నామాల అరుణ, యర్రా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



వేపగుంట సభకు హాజరైన ప్రజలు

దసరా ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ ఫ్రెండ్స్ యూనియన్ ఆధ్వర్యంలో సింహాచలం కొండ దిగువన మార్కెట్ ప్రాంతంలో అక్టోబర్ 3 నుంచి 12 వరకు జరగనున్న దుర్గా నవరాత్రి మహోత్సవాల ప్రచార కరపత్రాన్ని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. గురువారం సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్న అనంతరం మాడవీధిలో కరపత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో 98వ వార్డు కార్పొరేటర్ పీవీ.నరసింహం, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మోసం కేసులో నిందితుడి అరెస్టు

గాజువాక, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ ట్రేడింగ్ వ్యాపారం పేరిట పలువురిని మోసం చేసిన నిందితుడిని గురువారం గాజువాక పోలీసులు అరెస్టు చేశారు. ఆ వివరాలు.. వుడాకాలనీకి చెందిన ఎన్.శ్రీనివాసరావు(53) ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయని పలువురిని నమ్మించి వివిధ డిపాజిట్ స్కీముల్లో సభ్యులుగా చేర్పించాడు. కొద్ది రోజుల నుంచి శ్రీనివాసరావు ముఖం చాటేయడంతో ఖాతాదారులంతా పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు స్వామికి వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: భక్తుల కొంగు బంగారంగా సింహగిరిపై వెలుగొందుతున్న అప్పన్న స్వామికి గురువారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని శోభాయమానంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆసీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో దేవతామూర్తులకు అష్టోత్తర శత నామార్చన జరిపారు. అనంతరం అదే వేదికపై స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. గురువారం సందర్భంగా అంతరాలయంలో స్వామి బంగారు శాంత నృసింహ కవచం అలంకరణలో భక్తులను అనుగ్రహించారు.

'కేంద్రంపై ఒత్తిడి పెంచాలి'

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి ఉక్కు కర్మాగారం పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కృషి చేయాలని పోరాట కమిటీ నాయకుడు వి.శ్రీనివాసరావు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలో ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కొనసాగుతున్న దీక్షలు గురువారం 1323వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టు, అమరావతితో పాటు ఉక్కు కర్మాగారం పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శిబిరంలో జేఎంఎస్, డీఐటీయూ, వీఎస్ఈయూ, యూజ్ సంఘాల ప్రతినిధులు కూర్చున్నారు. పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మహాలక్ష్మినాయుడు, కె.పరంధామయ్య, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్లకు తాత్కాలికంగా అదనపు బోగీలు



రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పలు రైళ్లకు తాత్కాలికంగా అదనపు స్లీపర్, సాధారణ బోగీలు జత చేయనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

★ అక్టోబర్ 2, 11 తేదీల్లో భువనేశ్వర్-కేఎస్ఆర్ బెంగళూర్(18463), అక్టోబరు 3, 12 తేదీల్లో కేఎస్ఆర్ బెంగళూర్ - భువనేశ్వర్ (18463) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు ఒక స్లీపర్ బోగీ ★ అక్టోబరు 6 నుంచి నవంబరు 10 వరకు భువనేశ్వర్-తిరుపతి(22871), అక్టోబర్ 7 నుంచి నవంబరు 11 వరకు తిరుపతి-భువనేశ్వర్(22872) వారాంతపు రైళ్లకు ఒక సాధారణ రెండో తరగతి బోగీ ★ అక్టోబరు 1 నుంచి నవంబరు 5 వరకు భువనేశ్వర్-పుణె(22882), అక్టోబర్ 3 నుంచి నవంబరు 7 వరకు పుణె-భువనేశ్వర్(22881) వారాంతపు రైళ్లకు సాధారణ రెండో తరగతి బోగీ ★ అక్టోబరు 4 నుంచి 28 వరకు సంబల్‌పూర్-నాందేడ్(20809), అక్టోబర్ 5 నుంచి 29 వరకు నాందేడ్- సంబల్‌పూర్(20810) నాగావళి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఒక థర్డ్ ఎ.సి, ఒక స్లీపర్ బోగీ జత చేయనున్నట్లు తెలిపారు. ★ అక్టోబరు 2 నుంచి 30 వరకు సంబల్‌పూర్-ఈరోడ్(08311), అక్టోబరు 4 నుంచి నవంబరు 1 వరకు ఈరోడ్-సంబల్‌పూర్(08312) రైళ్లకు ఒక థర్డ్ ఎ.సి, ఒక స్లీపర్ బోగీ జత చేయనున్నట్లు తెలిపారు. ★ అక్టోబరు 1 నుంచి 31 వరకు విశాఖ-కిరండూల్-విశాఖ(08551-08552) రైళ్లకు ఒక స్లీపర్ బోగీ ★ అక్టోబరు 1 నుంచి 31 వరకు విశాఖ- గుణుపూర్-విశాఖ(08522-08521) రైళ్లకు ఒక స్లీపర్ బోగీ ★ అక్టోబరు 3 నుంచి నవంబరు 14 వరకు భువనేశ్వర్-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్(12830), అక్టోబరు 4 నుంచి నవంబరు 15 వరకు ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-భువనేశ్వర్(12829) రైళ్లకు ఒక సాధారణ బోగీ ★ అక్టోబరు 6 నుంచి నవంబరు 17 వరకు భువనేశ్వర్-ఎస్ఎంవీటీ బెంగళూర్(12845), అక్టోబరు 7 నుంచి నవంబరు 18 వరకు ఎస్ఎంవీటీ బెంగళూర్- భువనేశ్వర్ (12846) రైళ్లకు ఒక సాధారణ రెండో తరగతి బోగీ ★ అక్టోబరు 1 నుంచి నవంబరు 12 వరకు భువనేశ్వర్-పుదుచ్చేరి(12898), అక్టోబరు 2 నుంచి నవంబరు 13 వరకు పుదుచ్చేరి- భువనేశ్వర్ (12897) రైళ్లకు సాధారణ రెండో తరగతి బోగీ ★ అక్టోబరు 4 నుంచి నవంబరు 15 వరకు భువనేశ్వర్- రామేశ్వరం(20896), అక్టోబరు 6 నుంచి నవంబరు 17 వరకు రామేశ్వరం-భువనేశ్వర్(20895) రైళ్లకు ఒక సాధారణ రెండో తరగతి బోగీ జత చేయనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు గమనించి ఈ అదనపు బోగీలు సేవలు వినియోగించుకోవాలని కోరారు.

ఎస్‌జీఎఫ్ పోటీల్లో ప్రతిభ

ఇస్లాంపేట(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వ వార్డు పరిధి ఇస్లాంపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో ప్రతిభ చాటారు. ఈనెల 25న గాజువాకలో జరిగిన నియోజకవర్గ స్థాయి ఖోఖో పోటీల్లో అండర్ -17 విభాగంలో సందీప్ కుమార్, రబీనాబేగం, అండర్-14 విభాగంలో సూరజ్‌కుమార్, డి.సాయి, నౌసినాకౌజర్, వాలీబాల్ అండర్-17 విభాగంలో జశ్వంత్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, లలితబుద్ర, సీహెచ్ యామిని, చెస్ పోటీల్లో నీతాకుమారి ప్రతిభ చాటి ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విజేతలతో పాటు పీడీ ఎస్.నరసింహమూర్తిని ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల, ఉపాధ్యాయులు అభినందించారు.




ప్రతిభచాటిన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల, పీడీ నరసింహమూర్తి, ఉపాధ్యాయులు

ఆర్కే బీచ్‌కే మా ఓటు!!

'ఈనాడు' సర్వేలో విద్యార్థులు





న్యూస్‌టుడే, ఎంపీవీకాలనీ: పర్యాటక రాజధానిగా పేరుగాంచిన విశాఖలో సందర్శనీయ ప్రాంతాలెన్నో. నగరానికి వచ్చే పర్యాటకుల సందర్శనకు అనుగుణంగా ప్రభుత్వ సంస్థలు పలు పర్యాటక ప్రాంతాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నాయి. నిత్యం పెద్ద సంఖ్యలో జనం వాటిని సందర్శిస్తున్నారు. ఈ నెల 27న పర్యాటక దినోత్సవం. ఈ నేపథ్యంలో నగర పరిధిలోని పర్యాటక ప్రాంతాల్లో ఇష్టమైనవి ఏమిటని 'ఈనాడు' సర్వే నిర్వహించింది. అత్యధికులు ఆర్కే బీచ్‌కే ఓటేశారు. ఎంపీవీకాలనీలోని సమతా డిగ్రీ, వీజీ కళాశాల, ఎస్.వి.వి.పి. వి.ఎం.సి. డిగ్రీ కళాశాలల్లో విద్యార్థుల అభిప్రాయాలు సేకరించగా తమ మనోగతం వెల్లడించారు.

ఆర్కే బీచ్ తరువాత కైలాసగిరి, యారాడ బీచ్, రుషికొండ బీచ్ ఉన్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో అత్యధికులు ఆంధ్రా ఊటీగా పేరొందిన అరకుకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. అలాగే...లంబసింగి అంటే చాలా ఇష్టమని వెల్లడించారు.

నగర పరిధిలో జూపార్కు, సెంట్రల్ పార్కు, భీమిలి బీచ్, రోజ్‌హిల్స్, డాల్ఫిన్ నోస్, కంబాలకొండ వంటివి సందర్శించేందుకు ఆసక్తి చూపుతున్నట్లు పేర్కొన్నారు.









సర్వేలో పాల్గొన్న వివిధ కళాశాలల విద్యార్థులు

తెదేపా శాశ్వత సభ్యత్వానికి ఎంపీ కలిశెట్టి రూ.లక్ష అందజేత

వన్‌టౌన్, న్యూస్‌టుడే: తెదేపాలో శాశ్వత సభ్యత్వానికి విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు రూ.లక్ష చెక్కును రాష్ట్ర తెదేపా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సమక్షంలో తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్‌కు గురువారం విశాఖలోని పార్టీ కార్యాలయంలో అందజేశారు. వచ్చే నెలలో తెదేపా సభ్యత్వాల నమోదు ఆరంభం కానున్న నేపథ్యంలో తొలి సభ్యత్వం ఇదేనని మంత్రి లోకేశ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ అప్పలనాయుడు మాట్లాడుతూ ఒక సామాన్య కార్యకర్తనైన తనను ఎంపీగా అవకాశం కల్పించి పార్లమెంటుకు తెదేపా పంపించిందని, సభ్యత్వ నమోదుకు రూ.లక్ష అందజేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.



మంత్రి లోకేశ్‌కు చెక్కు అందజేస్తున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, చిత్రంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షల సాయం

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం టెక్కలిపాలెంలో రామాలయం నిర్మాణానికి గ్రామానికి చెందిన నూతన్‌నాయుడు రూ.10 లక్షల విరాళాన్ని అందించారు. సుజాతనగర్‌లో ఆయన నివాసంలో గురువారం ఆలయ కమిటీ సభ్యులకు విరాళ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి గొంప సత్యవతమ్మ, నాయుడు, ఆలయ కమిటీ సభ్యులు పైల వెంకటరమణ, పంచాడ శ్రీనివాసరావు, పంచాడ దేముడు, కన్నూరు నారాయణమూర్తి, దొగ్గ చిన్నయ్య, యడ్ల అప్పలనాయుడు, బర్ల శ్రీనివాసరావు, యడ్ల నర్సింంమూర్తి తదితరులు పాల్గొన్నారు.



రామాలయ కమిటీ సభ్యులకు రూ.10 లక్షల చెక్కు ఇస్తున్న నూతన్‌నాయుడు

వీఎంఆర్‌డీఏలో అంతర్గత బదిలీలు ఏవి?

ఈనాడు, విశాఖపట్నం : అన్ని ప్రభుత్వ శాఖల్లో బదిలీలు ముగిశాయి. విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ)కు మాత్రం అందులో పెద్ద మినహాయింపే ఉంది. నగరాభివృద్ధి సంస్థ కావడంతో ఇక్కడి ఉద్యోగులను ఎక్కడికీ బదిలీ చేసే అవకాశం లేదు. కొందరు ఉద్యోగులు ఒకే విభాగంలో ఏళ్లుగా పనిచేయడం సాధారణమైపోయింది. ఆయా విభాగాల్లోని కీలకమైన వ్యక్తులకు అనుకూలంగా ఉంటే వారికి బదిలీయే ఉండదు. కొందరైతే ఏకంగా 5 నుంచి 8 ఏళ్లుగా ఒకే విభాగంలో చేస్తున్నారు. కమిషనర్, కార్యదర్శులు తరచూ మారడంతో అటువంటి వారి మీద, అంతర్గత బదిలీలపైనా దృష్టిసారించడం లేదు.

★ వీఎంఆర్‌డీఏలోని పలు విభాగాల్లో కొందరు ఉద్యోగుల పదోన్నతులు ఇష్టానుసారంగా సాగుతున్నాయి. కొందరు విభాగాధిపతులకు నచ్చితే ఒకలా, నచ్చకపోతే మరోలా చేస్తున్నారు. దీంతో పలువురు ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఒకే రకమైన అర్హతలున్న వారిలో కొందరికి పదోన్నతులు కల్పించి మిగిలిన వారికి కల్పించడం లేదన్న విమర్శలున్నాయి.

★ ఒక ఉద్యోగికి డీపీసీ(డిపార్టుమెంటల్ ప్రమోషనల్ కమిటీ)లో ఏవో పదోన్నతికి అవకాశమున్నా ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారు. కొందరు కీలక ఏవోలను మార్చాల్సి వస్తుందని ఇలా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

★ ప్లానింగ్ విభాగంలో జేపీవో పోస్టులకు అర్హులైన వారున్నప్పటికీ డిప్యుటేషన్ మీద ఇతరులను నియమించడంపై విమర్శలు వస్తున్నాయి.

★ ఇంజినీరింగ్ విభాగంలో అర్హులైన వారు వర్క్-ఇన్‌స్పెక్టర్లుగా, డ్రాఫ్ట్స్‌మెన్, ఇంజినీర్లుగా పదోన్నతులు కోరుతున్నా తాత్సారం జరుగుతోంది.

★ విజిలెన్స్ కేసులను సాకుగా చూపించి కొందరికి పదోన్నతులు కల్పించడం లేదు. అయితే గతంలో కేసులున్నా పలువురికి పదోన్నతులు కల్పిస్తున్నారు.

★ వీఎంఆర్‌డీఏలో బదిలీలు ఉండవని కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శల నేపథ్యంలో కమిషనర్ ప్రత్యేక దృష్టిసారించారు. వీఎంఆర్‌డీఏ శివారు జోన్లలో ప్రాంతీయ కార్యాలయాలు ఏర్పాటు చేసి ఉదాసీనంగా వ్యవహరించే ఉద్యోగులను ఆ కార్యాలయాలకు పంపించేలా చేస్తామని ఇటీవల చెప్పారు.

సబ్‌రిజిస్ట్రార్ సంజీవయ్య బదిలీ ఉత్తర్వులు రద్దు

ఈనాడు, విశాఖపట్నం : విశాఖ సూపర్‌బజార్ కార్యాలయానికి గ్రేడ్-1 సబ్‌రిజిస్ట్రార్‌గా నియమితులైన సంజీవయ్య బదిలీ ఉత్తర్వులను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రద్దు చేసినట్లు స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ డీఐజీ బాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంజీవయ్యపై పలు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. నిబంధనల ప్రకారం సి కేటగిరిలో పనిచేసే ఉద్యోగులకున్న మొదటి ప్రాధాన్యక్రమం ప్రకారమే సంజీవయ్య విశాఖ ఆర్‌వోను ఎంచుకున్నారని, కౌన్సెలింగ్‌లో సదరు అభ్యర్థి కోరుకున్న స్థానాన్ని సీనియార్టీ జాబితా ప్రకారమే ఇప్పటి వరకు కేటాయించినట్లు అధికారులు పేర్కొన్నారు.

విశాఖ ఆర్టీవోగా దేవి బాధ్యతల స్వీకరణ

మాధవధార, న్యూస్‌టుడే: విశాఖ ఆర్టీవోగా జి.ఎస్.ఎల్.ఎం.దేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం ఆర్టీవోగా పని చేస్తున్న ఈమె బదిలీలో భాగంగా విశాఖపట్నం డీటీసీ కార్యాలయానికి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన జి.మనీష మచిలీపట్నం వెళ్లారు. ఆన్‌లైన్ ద్వారా రవాణా సేవలు త్వరితగతిన పూర్తయ్యేలా తగు చర్యలు తీసుకుంటామని దేవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమెకు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలియజేశారు. పరిపాలన అధికారి (ఏఓ) డి.మంజుల, సీనియర్ అసిస్టెంట్లు ఎస్.లక్ష్మి, కె.నాగమణి, ఎం.సుధారాణి, పి.ఆదిలక్ష్మి కూడా విధుల్లో చేరారు.



ఆర్టీవో దేవి

జలవనరుల శాఖ ఎస్ఈగా సుగుణాకరరావు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జలవనరుల శాఖ విశాఖ జిల్లా పర్యవేక్షక ఇంజినీర్(ఎస్ఈ)గా ఆ శాఖ నార్త్‌కోస్టు సీఈ(చీఫ్ ఇంజినీర్) శంబంగి సుగుణాకరరావుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జలవనరుల శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం విశాఖ జిల్లా ఎస్ఈ పోస్టు ఖాళీగా ఉండడంతో సుగుణాకరరావును ఇన్‌ఛార్జిగా ప్రభుత్వం నియమించింది.

గ్రేటర్‌కు అవినీతి సర్వేయర్లు!!

నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు

ఈనాడు-విశాఖపట్నం: సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ విభాగంలో సర్వేయర్ల బదిలీలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మహావిశాఖ నగరపాలక సంస్థకు బదిలీపై వచ్చిన సర్వేయర్లలో కొందరిపై అవినీతి ఆరోపణలున్నాయి. ఒకేచోట ఐదేళ్ల సర్వీసు పూర్తయితేనే బదిలీ చేయాలన్న నిబంధనలున్నా, ఏడాది సర్వీసు సైతం పూర్తికాకుండానే బదిలీ చేయడం గమనార్హం. అవినీతి నిరోధకశాఖ కేసులున్న వారికి, అక్రమాల నేపథ్యంలో గతంలో జీవీఎంసీ సరెండర్ చేసిన వారికి కూడా తాజా బదిలీల్లో తిరిగి నగరంలో పోస్టింగ్‌లు ఇవ్వడం గమనార్హం.

★ ఈ నెల 22న జరిగిన బదిలీల్లో జీవీఎంసీకి కొందరు సర్వేయర్లను కేటాయించారు. విచిత్రమేమంటే వీరిలో పలువురికి ఏడాది సర్వీసు పూర్తి కాకుండానే జీవీఎంసీ పరిధిలోకి తేవడం. సిఫార్సులు, కాసులు ప్రభావం చూపాయని కొందరు సర్వేయర్లు విమర్శిస్తున్నారు.

★ 'ఏడేళ్లుగా మైదాన ప్రాంతంలో పనిచేస్తున్నాం. బదిలీలు చేయండి మహాప్రభో' అని దరఖాస్తు పెట్టి మొరపెట్టుకున్నా పరిగణనలోకి తీసుకోలేదు. అవినీతి, అక్రమాలు, ఏసీబీ కేసులున్న కొందరి సర్వేయర్ల పైరవీలకే పెద్దపీట వేశారు.

★ ఉమ్మడి విశాఖ నుంచి వచ్చే వారిలో ఓ సర్వేయర్‌ను గతంలో జీవీఎంసీ కమిషనర్ మాతృసంస్థకు సరెండర్ చేశారు. బక్కన్నపాలెంలో ఓ ప్రభుత్వ భూమి ప్రైవేటుకు కట్టబెట్టడం, కొన్ని వివాదాస్పద భూములకు తానే సర్వేయర్‌గా ఉన్నారన్న ఆరోపణలతో ఈ చర్యలు తీసుకున్నారు. లంచం తీసుకున్నారంటూ మరో సర్వేయర్‌పై అవినీతి నిరోధకశాఖ కేసు ఉంది. ఓ సర్వేయర్‌పై దేవస్థాన భూముల వ్యవహారంలో ఆరోపణలున్నాయి. ఓ సర్వేయర్‌ను జీవీఎంసీ నుంచి వేరే చోటుకు బదిలీ చేసినా...సిఫార్సులతో తనకు ఇష్టమైన చోటుకి బదిలీ చేయించుకున్నారన్న విమర్శలున్నాయి.

★ కొందరు సర్వేయర్లు విలువైన ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టి జేబులు నింపేసుకుంటున్నారు. గెడ్డలు, వాగు పోరంబోకులు ఆక్రమిస్తే సర్వేచేసి అక్రమాలు నిగ్గుతేల్చాల్సి ఉన్నా... అంతా బాగున్నట్లు రాసిచ్చేస్తున్నారు.

మంత్రి లోకేశ్ ప్రజాదర్బార్!

భారీగా తరలివచ్చి వినతులిచ్చిన ప్రజలు

ఈనాడు, విశాఖపట్నం, న్యూస్‌టుడే, వన్‌టౌన్: విశాఖ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంత్రి లోకేశ్ గురువారం ప్రజాదర్బార్ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు మంత్రిని కలిసి సమస్యలు విన్నవించారు. ★ పార్టీ నాయకులు, కార్యకర్తలు పలువురు తమను గుర్తించాలని, నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలని కోరారు. ★ మద్యం నూతన విధానంలో కల్లు గీత కార్మికులకు ప్రాధాన్యం ఇచ్చేలా నిర్ణయించడంతో కృతజ్ఞత చెప్పేందుకు కొందరు కార్మికులు రాగా వారితో ముచ్చటించారు. ★ జర్నలిస్టులకు నాలుగు సెంట్లలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, కొవిడ్‌తో మృతి చెందిన వారికి పరిహారం ఇవ్వాలని జర్నలిస్టు సంఘాలు కోరాయి. ★ దళితుల సంక్షేమం కోసం పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, వైకాపా పాలనలో చోటుచేసుకున్న కోడికత్తి శ్రీను, కాకినాడకు చెందిన వీధి సుబ్రహ్మణ్యం హత్యకేసు, డాక్టర్ సుధాకర్ కేసులపై ప్రభుత్వం పునఃసమీక్ష చేయాలని విశాఖ దళిత సంఘాల సమాఖ్య(విదసం) కన్వీనర్ బూసి వెంకటరావు వినతిపత్రం అందజేశారు.



మంత్రి లోకేశ్‌కు చెక్కు అందజేస్తున్న గిరీషా శ్రీచైతన్య విద్యార్థులు

★ విజయవాడ వరద బాధితులకు తమ వంతు సహాయంగా కంచరపాలెంలోని గిరీషా శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు తమ కిడ్డీ బ్యాంకు నుంచి రూ.25 వేలను విరాళంగా ఇచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జె.అనురాధ, ఉపాధ్యాయులు కవితా మహంతి, మానస తదితరులు పాల్గొన్నారు. ★ మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ బోటు ఆపరేటర్ల సంఘం ప్రతినిధులు మైలపల్లి లక్ష్మణరావు, పీసీ అప్పారావు, జి.పరుశరామ్, నర్సింగరావు, మున్నం బాలాజీ తదితరులు విన్నవించారు. ★ పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్ అనంతరం శ్రీకాకుళంలోని పాఠశాలల తనిఖీలు ముగించుకొని సాయంత్రం విశాఖ విమానాశ్రయం నుంచి విజయవాడకు తిరుగుపయనమయ్యారు. మంత్రికి తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, విశాఖ పార్లమెంటు నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడు గండి బాబ్జీ, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్‌గోపాల్, తెదేపా రాష్ట్ర కార్యదర్శి నజీర్ వీడ్కోలు పలికారు.



మాట్లాడుతున్న తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా

★ మంత్రి వెళ్లిన తరువాత కూడా తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, విశాఖ పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జీ వినతులు పరిశీలించి బాధితులతో మాట్లాడారు. అనంతరం కృతజ్ఞతలు తెలిపేందుకు వచ్చిన కల్లు గీత కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు.



పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు పల్లా, వెలగపూడి, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, తదితరులు



వినతులు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలు

సింహాద్రి అప్పన్న సేవలో నారా లోకేశ్

సింహాచలం, న్యూస్‌టుడే: మంత్రి నారా లోకేశ్ గురువారం సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు, ఈవో వేండ్ర త్రినాథరావు పూర్ణకుంభంతో సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని మొక్కుకున్నారు. నాదస్వర మంగళవాయిద్యాల నడుమ ఆలయ బేడామండపంలో ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వర్ణకవచంలో అలంకరణలో ఉన్న సింహాద్రినాథుడిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఐవీ.రమణాచార్యులు లోకేశ్ పేరిట స్వామికి అర్చనలు చేశారు. బేడామండపంలోని భాండాగారం వద్ద స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ నేతృత్వంలో పండితులు వేదమంత్రాలతో లోకేశ్‌ను ఆశీర్వదించి సింహాచలం క్షేత్ర మహాత్మ్యాన్ని వివరించారు. దేవస్థానం ఈవో వేండ్ర త్రినాథరావు స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. లోకేశ్ వెంట విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, ఎమ్మెల్యేలు గణబాబు, బండారు సత్యనారాయణమూర్తి, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, తెదేపా విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు గండి బాబ్జీ, 98వ వార్డు కార్పొరేటర్ పీవీ.నరసింహం, తదితరులు పాల్గొన్నారు.



ఆలయ ప్రాంగణంలో భక్తులకు అభివాదం చేస్తున్న నారా లోకేశ్

తిరుమల పవిత్రతను పరిరక్షించాలని భక్తుల వినతి

సింహాచలం, న్యూస్‌టుడే: తిరుమల పవిత్రతను పరిరక్షించి.. హిందూ సంప్రదాయాలను కాపాడాలని పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు ప్రాంతానికి చెందిన పలువురు మహిళా భక్తులు మంత్రి నారా లోకేశ్‌ను కోరారు. వరద సమయంలో చేసిన సహాయ చర్యలు బాగున్నాయని భక్తులు తెలిపారు. దేవాలయాల్లో డబ్బుల వసూళ్లు పెరిగాయని లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. పాలకొల్లులో ఆర్యవైశ్య కల్యాణ మండపం విషయం చూడాలని భక్తులు తెలపగా అది నిమ్మల రామానాయుడు చూసుకుంటారని పేర్కొన్నారు. తిరుమల పవిత్రతను కాపాడే విషయంలో ప్రభుత్వం నిమగ్నమై ఉందన్నారు. ★ చంద్రబాబు అరెస్టు గురించి ఓ భక్తులు, మీడియా ప్రస్తావించగా. రాజకీయాలు ఇక్కడ వద్దని సున్నితంగా తిరస్కరించారు. అభిమానులు, భక్తులు ఫొటోలు దిగేందుకు మాడవీధిలో కారు వద్ద సుమారు అరగంట పాటు అవకాశం కల్పించారు. వృద్ధులు, చిన్నారులు, దివ్యాంగులను ఆప్యాయంగా పలకరించారు.

కౌన్సిల్‌లో ఒకటి రద్దు... మరొకటి వాయిదా

★ మెకానికల్ విభాగంలో వ్యయం తగ్గింపు ప్రణాళికలు
★ ముడసర్లోవలో గుర్రాల పార్కు వ్యయంపై ఆశ్చర్యం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం మూడవ రోజు మధ్యాహ్నం 2.15 గంటలకు ప్రారంభమైంది. బుధవారం 14 అంశాలపై చర్చ జరిపిన సభ్యులు మూడింటిని వాయిదా వేశారు. అయితే ఆయా అంశాలపై పూర్తి వివరాలు తెలుసుకోవడంతోపాటు, పోర్టు కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా చేపట్టిన పనులు కావడంతో వాటిని ఆమోదించాలన్న స్థానిక కార్పొరేటర్ల అభ్యర్థన మేరకు వాయిదా వేసిన వాటిని తిరిగి ప్రవేశపెట్టి ఆమోదించారు. గురువారం టేబుల్ అజెండాగా ఎనిమిది అంశాలను అధికారులు ప్రవేశపెట్టగా, 69 అంశాలపై చర్చించిన సభ్యులు ఒక అంశాన్ని పూర్తిగా రద్దు చేసి, మరొకటి వాయిదా వేశారు. సమావేశంలో కమిషనర్ సంపత్‌కుమార్ ఇచ్చిన వివరణ, హామీలతో అంశాలకు సభ్యులు ఆమోదం తెలపడం కనిపించింది. ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన జోన్-6 కార్యనిర్వాహక ఇంజినీరు ప్రసాద్‌బాబును తిరిగి పొరుగు సేవల పద్ధతిలో విధుల్లోకి తీసుకునే అంశాన్ని పూర్తిగా రద్దు చేశారు. నీటి సరఫరా విభాగంలో కార్మికుల వేతనాలు రూ.18,500 చెల్లించాలన్న ప్రతిపాదనను సభ్యులు వాయిదా వేశారు. మిగతా అన్ని అంశాలకు ఆమోదం తెలిపారు.



మేయరు హరి వెంకట కుమారి

ఖర్చు తగ్గించుకునేలా కార్యాచరణ

మహా విశాఖ నగరపాలక సంస్థ మెకానికల్ విభాగంలో వ్యయం అధికమవుతుందన్న ఆరోపణల నేపథ్యంలో దానిని ఏ విధంగా తగ్గించాలన్న అంశంపై ప్రణాళికలు తయారు చేసి అమలు చేస్తామని కమిషనర్ సంపత్‌కుమార్ పేర్కొన్నారు. తెదేపా ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు మెకానికల్ విభాగంలో ఎన్ని వాహనాలున్నాయి, ఎక్కడెక్కడ తిరుగుతున్నాయో తెలియడంలేదని పేర్కొన్నారు. 2వ వార్డు కార్పొరేటర్ చిన్ని కుమారి లక్ష్మి, విల్లూరి భాస్కరరావు మాట్లాడుతూ కోట్లు వ్యయం చేస్తున్నా పారిశుద్ధ్య నిర్వహణలో మార్పు ఉండటంలేదని పేర్కొన్నారు. జీవీఎంసీ వాహనాలెన్ని, వాటి నిర్వహణకు వ్యయాన్ని ఎలా లెక్కకట్టారని కార్పొరేటర్ కాకి గోవింద్‌రెడ్డి, లేళ్ల కోటేశ్వరరావు ప్రశ్నించారు. టన్ను చెత్తకు రూ.2,500 వరకు సేకరణ నుంచి తరలింపు వరకు వ్యయమవుతుందని, జీవీఎంసీలో అంతకంటే తక్కువగానే వ్యయం చేస్తున్నారని, ఇంకా తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తామని కమిషనర్ పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రత్యేకంగా పెట్రోల్ బంకు తీసుకుని, అందులోనే డీజిల్ వేయించుకునేలా చర్యలు చేపడతామని, ప్రతి వాహనానికి జీపీఎస్ ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. ఆయన ఇచ్చిన హామీతో మెకానికల్ అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు.

★ జీవీఎంసీకి ఉన్న ఏకైక ఆస్తి ముడసర్లోవ భూములని, వాటిలో చాలా వరకు అన్యాక్రాంతమైనట్లు చెబుతున్నారని, రైల్వేకు ఎంత భూమి కేటాయించారు, ఎంత భూమి జీవీఎంసీ ఆధీనంలో ఉందన్న విషయాలను తెలియజేయాలని 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ కోరారు. జీవీఎంసీ పాలకవర్గానికి తెలియకుండా రూ.9 కోట్ల వ్యయంతో పర్యావరణానికి విఘాతం కలిగించేలా గుర్రాల పార్కు ఎలా నిర్మిస్తున్నారని, ఇప్పటి వరకు సభ్యుల దృష్టికి ఎందుకు తీసుకురాలేదని ఆయన ప్రశ్నించారు. ప్రధాన ఇంజినీరు వినయ్‌కుమార్ సమాధానమిస్తూ మేయరు ముందస్తు అనుమతితో పనులు చేస్తున్నామని, తరువాత సమావేశంలో సభ్యులకు తెలియజేయాలని అనుకున్నట్లు ఆయన పేర్కొనడంపై కార్పొరేటర్లు అవాక్కయ్యారు. రూ.10 లక్షలు పెట్టి రోడ్డు, కాలువ నిర్మించాలంటే నిధుల్లేవని చెబుతున్న అధికారులు రూ.9 కోట్లతో గుర్రాల పార్కు ఎలా నిర్మిస్తున్నారని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తక్షణమే ఆయా పనులు నిలిపివేయాలని కోరారు. ముడసర్లోవ ప్రాజెక్టుపై వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత మాట్లాడటానికి ప్రయత్నించినా, మేయరు ఆమెకు అవకాశం ఇవ్వలేదు.



మాట్లాడుతున్న కమిషనర్ సంపత్‌కుమార్, తెదేపా ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు

తహసీల్దార్ల బదిలీల్లో మార్పులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో తహసీల్దార్ల బదిలీల్లో పలు మార్పులు చోటుచేసుకున్నాయి. ముగ్గురు తహసీల్దార్లను మార్చుతూ గురువారం కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. పెందుర్తి తహసీల్దార్‌గా కొనసాగుతున్న కె.వేణుగోపాల్‌ను వీఎంఆర్‌డీఏ భూ సేకరణ విభాగం ప్రత్యేక తహసీల్దార్‌గా నియమించారు. ఇక్కడ కొనసాగుతున్న కె.ఆనందరావును పద్మనాభం తహసీల్దార్‌గా నియమించారు. పద్మనాభంలో విధులు నిర్వహిస్తున్న ఎం.ఆనంద్‌కుమార్‌ను పెందుర్తికి బదిలీ చేశారు. గతంలో పెందుర్తి తహసీల్దార్‌గా ఆనంద్‌కుమార్ పనిచేసిన సమయంలో అతనిపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. దీంతో అప్పటి కలెక్టర్ ఇతన్ని బదిలీ చేశారు. మళ్లీ అదే వ్యక్తిని పెందుర్తికి నియమించడంపై రెవెన్యూ వర్గాల్లో విస్మయం వ్యక్తమవుతోంది. సబ్బవరం మండల తహసీల్దార్ బి.రవికుమార్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లాకు కేటాయించారు. అల్లూరి కలెక్టరేట్‌లో పర్యవేక్షకులుగా పనిచేస్తున్న తహసీల్దార్ బి.చిన్నికృష్ణను అనకాపల్లి జిల్లాకు కేటాయించారు. ప్రజాప్రతినిధుల ఒత్తిడి మేరకు ఆయా బదిలీలు జరిగాయనే చర్చ సాగుతోంది. పౌర సరఫరాల శాఖ సర్కిల్-2 విభాగంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులైన బంటు రమణను విశాఖపట్నం ఆర్డీవో కార్యాలయానికి కేటాయించారు. ఆయా ఉత్తర్వులు ఈనెల 22వ తేదీతో వెలువడడం విశేషం.

ఎన్ఎల్ఎం బృందానికి అధికారులు సహకరించాలి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి పర్యవేక్షణ(ఎన్ఎల్ఎం) బృందానికి అధికారులంతా సహకరించాలని జేసీ కె.మయూర్ అశోక్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీ, డ్వామా, ఎంపీడీఓలు, సంబంధిత అధికారులతో గురువారం జేసీ సమీక్ష నిర్వహించి మాట్లాడారు. కేంద్రం నుంచి వచ్చిన ఎన్ఎల్ఎం బృంద సభ్యులు అనిల్ నింభోర్కర్, అనిల్ గైక్వాడ్ జిల్లాకు వచ్చారని రోజుకు రెండు పంచాయతీల్లో అయిదు రోజుల పాటు క్షేత్ర స్థాయిలో వీరు పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడి పథకాల అమలు తీరును తెలుసుకుంటారన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, జెడ్పీ సీఈఓ సత్యనారాయణ, డీపీఓ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసరావు, ఎల్డీఎం ఎం.శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విశాఖ ఆర్డీవోగా పి.శ్రీలేఖ

ఈనాడు, విశాఖపట్నం : జిల్లాలోని పలువురు డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖ ఆర్డీవోగా పి.శ్రీలేఖను నియమించింది. ఇక్కడ పని చేస్తున్న హుస్సేన్ సాహెబ్‌ను సాధారణ పరిపాలనశాఖకు రిపోర్టు చేయాలని సూచించింది. భీమిలి ఆర్డీవోగా కె.సంగీత్ మాధుర్‌ను నియమించగా...ఇక్కడున్న భాస్కర్‌రెడ్డిని సాధారణ పరిపాలనశాఖకు రిపోర్టు చేయాలని ఉత్తర్వులో పేర్కొంది. విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) కార్యదర్శి దాట్ల కీర్తి విజయనగరం ఆర్డీవోగా బదిలీ అయ్యారు. జాతీయ రహదారుల సంస్థ ప్రత్యేక డిప్యూటీ కలెక్టరు డి.అఖిల.. చీరాల ఆర్డీవోగా బదిలీ అయ్యారు.



ఉచిత స్టడీ మెటీరియల్‌ను విడుదల చేస్తున్న మైనార్టీ సంక్షేమశాఖ జిల్లా అధికారి జ్యోతిమాధవి తదితరులు

ఉచిత స్టడీ మెటీరియల్ విడుదల

వన్‌టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న టెట్, డీఎస్సీ-2024 నోటిఫికేషన్‌కు సంబంధించి పోటీ పరీక్షలకు అవసరమైన ఉచిత స్టడీ మెటీరియల్‌ను గురువారం మైనార్టీ సంక్షేమశాఖ జిల్లా అధికారి ఎస్.జ్యోతి మాధవి తన కార్యాలయంలో గురువారం విడుదల చేశారు. కార్యక్రమంలో సంక్షేమశాఖ పర్యవేక్షకులు వి.ఎస్.ఎస్.ఎస్.శర్మ, ఏపీ సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారి ఎస్.ఎల్.సుధాకర్, శ్రీగాయత్రి ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రతినిధి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్‌లో 'ఆస్ట్రేలియా అడ్మిషన్ డే' వేడుక

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : ఆస్ట్రేలియాలో ప్రతిష్ఠాత్మకమైన విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థల సహకారంతో గురువారం దువ్వాడ విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కళాశాలలో 'ఆస్ట్రేలియా అడ్మిషన్ డే' వేడుక నిర్వహించారు. విజ్ఞాన్ విద్యాసంస్థల ఛైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ... ఏటా విద్యా లక్ష్యాలు సాధించేందుకు ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తున్నామన్నారు. అనంతరం ఆస్ట్రేలియాలోని విద్యాలయాలు, ప్రవేశాలు, ఉపకారవేతనాలు, ఉపాధి అవకాశాలు.. తదితర అంశాలపై వివరించారు. కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపల్ జె.సుధాకర్, ఎంబీఏ విభాగం కో-ఆర్డినేటర్ ఎంఎస్.మురళీకృష్ణ, డీన్స్, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

భీమిలి

సినిమాలు

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే

గణేశ్ - మత్తు వదలరా-2
రాములమ్మ- దేవర,
తాతా- సరిపోదా శనివారం, దేవర
మహరాజ్ (ఆనందపురం) - దేవర

విధేయతకు గుర్తింపు


మంత్రి లోకేశ్‌కు పుష్ప గుచ్ఛం అందిస్తున్న దాసరి శ్రీనివాస్

పీఎంపాలెం, న్యూస్‌టుడే: రాష్ట్ర పద్మశాలి సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ సభ్యులుగా నియమితులైన దాసరి శ్రీనివాస్ గురువారం నగర పర్యటనలో ఉన్న మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడి పని చేసిన తనకు మెరుగైన పదవిని అందించి విధేయతకు పట్టం కట్టారని పేర్కొన్నారు.

దసరా ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ ఫ్రెండ్స్ యూనియన్ ఆధ్వర్యంలో సింహాచలం కొండ దిగువన మార్కెట్ ప్రాంతంలో అక్టోబర్ 3 నుంచి 12 వరకు జరగనున్న దుర్గా నవరాత్రి మహోత్సవాల ప్రచార కరపత్రాన్ని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. గురువారం సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్న అనంతరం మాడవీధిలో కరపత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో 98వ వార్డు కార్పొరేటర్ పీవీ.నరసింహం, యూనియన్ ప్రతినిధులు మజ్జి చంద్ర శ్రీనివాస్, రాజనాల సత్యారావు, గుసిడి శంకర్రావు, ఫణి మనోహర్, మధు, రామారావు, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.


ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి నారా లోకేశ్

మేమున్నాం.. మీకు తోడుగా

80086 11711, 99122 22247

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

ఎండాడ, న్యూస్‌టుడే

సమస్య: రుషికొండ ఉన్నత పాఠశాల సమీప లేఅవుట్‌లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. - శ్రీను, రుషికొండ

సమాధానం: రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. - సింహాచలం, జోన్-2 కమిషనర్

సమస్య: సుభాష్‌నగర్ (ఎండాడ) నుంచి బీచ్ రోడ్డుకు వెళ్లే దారిలో రాత్రివేళ వాహనాలతో పాడైన ఇంటి సామగ్రి వేసి డంపింగ్‌యార్డ్‌లా మారుస్తున్నారు.
- స్థానికులు, సుభాష్‌నగర్

సమాధానం: సంబంధిత ప్రాంతాల్లో గస్తీ ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటాం.
- సింహాచలం, జోన్-2 కమిషనర్

సమస్య: ముబారక్‌కాలనీ (ఎండాడ) పార్కును ఆనుకుని ఉన్న మురుగుకాలువ అధ్వానంగా ఉంది.
- స్థానికులు, ముబారక్‌కాలనీ

సమాధానం: కాలువల శుభ్రతకు చర్యలు తీసుకుంటాం. - రవి, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్

భారీ వర్షం.. రహదారుల జలమయం

పీఎంపాలెం, న్యూస్‌టుడే: పీఎంపాలెం, మధురవాడ ప్రాంతాల్లో గురువారం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎక్కడికక్కడ రహదారులపై వరద నిలిచిపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. పీఎంపాలెం హౌసింగ్‌బోర్డు కాలనీలోని పోస్టల్ కార్యాలయం, సాంకేతిక కళాశాల ఎదురుగా కాలనీలో, ట్రాఫిక్ స్టేషన్ వద్ద ఎన్టీఆర్ విగ్రహం వెనుక, స్వాతంత్రనగర్ కాలనీ, ఏఎస్సార్ లేఅవుట్‌లోని రహదారులు... స్టేడియం బి-మైదానం గేటు వద్ద, పనోరమహిల్స్ ప్రధాన గేటు, పనోరమహిల్స్ సెలబ్రిటీ టవర్స్ పక్కన లేఅవుట్ తదితర చోట్ల రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోయింది. ఆయా కాలనీలవాసులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది.


తగరపువలస జాతీయరహదారిలో సంగివలస వద్ద..


స్టేడియం వెనుక ఏఎస్సార్ లేఅవుట్ వద్ద..

తగరపువలస, గ్రామీణభీమిలి: భీమిలి మండలంలో గురువారం కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వానకు తగరపువలస జాతీయరహదారి సంగివలస, సబ్బివానిపేట సర్వీసురోడ్డులో నీరు నిలిచిపోయింది. వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బీచ్‌రోడ్డు, భీమిలి గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు చెరువులను తలపించాయి. అన్నవరం, నాగమయ్యపాలెం, భీమిలి, చేపలుప్పాడ, మంగమారిపేట తీర ప్రదేశాల్లో మత్స్యవేట నిలిచిపోయింది.


పీఎంపాలెం పోస్టల్ కార్యాలయం వద్ద నిలిచిన నీరు


సాంకేతిక కళాశాల ఎదురు కాలనీలో అంతర్గత రహదారులిలా..

నేడు ఉచిత వైద్యశిబిరం

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రి ఆధ్వర్యంలో తగరపువలస-భీమిలి రోడ్డులోని కీటీన్‌పేట సెయింటు పీటర్స్ చర్చి వద్ద ఉచిత మెగా వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించనున్నట్లు భీమిలి జోనల్ కమిషనరు పి.ప్రేమ ప్రసన్నవాణి తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉంటుందన్నారు. సాధారణ వైద్య విభాగం, శస్త్రచికిత్స, ఎముకల చికిత్స, కంటి వైద్యం, పిల్లలు, స్త్రీలు, దంతవైద్యం, చెవి, ముక్కు, గొంతు వైద్యం నిపుణ వైద్యులు హాజరుకానున్నట్లు తెలిపారు.

● రాత పుస్తకాల పంపిణీ

పీఎంపాలెం, న్యూస్‌టుడే: పీఎంపాలెం సమీప కంబాలకొండ అభయారణ్య ప్రాంతంలో ఉన్న శంభువానిపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అటవీశాఖ రేంజర్ బి.రామ్‌నరేష్ రాత పుస్తకాలను అందజేశారు. తన తండ్రి బి.తవిటినాయుడు జ్ఞాపకార్థం బి.టి.నాయుడు ఛారిటబుల్ ట్రస్టు సహకారంతో ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్, ఉపాధ్యాయులు అనిల్, గ్రామస్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న అటవీశాఖ రేంజర్ రామ్‌నరేష్

● చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


జగన్నాథరావు (పాతచిత్రం)

పద్మనాభం, న్యూస్‌టుడే: కందిరీగల దాడిలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఒక వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆ వివరాలిలా. . కోరాడ గ్రామానికి చెందిన మీసాల జగన్నాథరావు (47) ఈ నెల 17న పొలంలో ట్రాక్టర్‌తో దున్నుతుండగా కందిరీగలు దాడి చేశాయి. బాధితుడ్ని విజయనగరంలోని మహారాజా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం విశాఖలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. మృతుడి భార్య మీసాల దుర్గాభవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అల్లుపేటలో అగ్నిప్రమాదం

తాటితూరు(తగరపువలస), న్యూస్‌టుడే: భీమిలి మండలం దాకమర్రి పంచాయతీ అల్లుపేటలో గురువారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఇందులో నాలుగు పూరిళ్లు కాలిపోయాయి. రూ.3 లక్షల నగదు, అయిదు తులాల బంగారు ఆభరణాలు కాలిబూడిదైనట్లు బాధితులు తెలిపారు. ఒక్కసారిగా వ్యాపించిన మంటలతో అల్లు ముత్యాలు, లక్ష్మణరావు, అప్పన్న, చంద్రయ్య ఇళ్లు దగ్ధమయ్యాయి. ఆ సమయంలో వారంతా పొలం పనులకు వెళ్లడంతో ప్రాణనష్టం తప్పింది. పశువుల పాకలు, ధాన్యం గాదెలు సైతం అగ్నికి ఆహుతయ్యాయి. పేదలైన వారంతా కట్టుబట్టలతో మిగిలారు. చిట్టివలస అగ్నిమాపక కేంద్రం సిబ్బంది మంటలను అదుపు చేసింది.


కాలిపోతున్న పూరిళ్లు

వైభవంగా స్వర్ణ పుష్పార్చన



సింహాచలం, న్యూస్‌టుడే: భక్తుల కొంగు బంగారంగా సింహగిరిపై వెలుగొందుతున్న అప్పన్న స్వామికి గురువారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని శోభాయమానంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో దేవతామూర్తులకు అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం అదే వేదికపై స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. గురువారం సందర్భంగా అంతరాలయంలో స్వామి బంగారు శాంత నృసింహ కవచం అలంకరణలో భక్తులను అనుగ్రహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు నృసింహావతార మూర్తిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

బంగారమ్మ తల్లికి నీరాజనం

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: సాగర్‌నగర్ సమీప దసపల్లా లేఅవుట్‌లోని బంగారమ్మ అమ్మవారి ఆలయంలో వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, అర్చకులు పులఖండం వెంకటేష్‌శర్మ సమక్షంలో అమ్మవారిని పుష్పాలతో ఆకర్షణీయంగా అలంకరించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


పుష్పాలంకరణలో అమ్మవారు

రామచంద్రుడి సన్నిధిలో సంక్షిప్త రామాయణ హవనం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీరామచంద్రుడు ఆవిర్భవించిన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై పవిత్ర గంగధార సమీపంలో కొలువైన శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో గురువారం విశేష హోమాలు, పారాయణలు జరిగాయి. అప్పన్న ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ నేతృత్వంలో అర్చకులు సీతారాముల ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ ఉత్సవ మండపంలో కొలువుదీర్చారు. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం పూజలు జరిపారు. యజ్ఞగుండంలో అగ్నిప్రతిష్ఠాపన చేసిన శ్రీరామ షడక్షరి, సంక్షిప్త రామాయణ హవనం నిర్వహించారు. హోమద్రవ్యాలను యజ్ఞగుండంలో సమర్పించి పూర్ణాహుతి జరిపించారు. భక్తులు పాల్గొని హోమగుండం ప్రదక్షిణం చేశారు.


సీతారామ లక్ష్మణమూర్తులు, రామచంద్రుడి సన్నిధిలో హవనం నిర్వహిస్తున్న అర్చకులు

భీమిలి సీహెచ్‌సీలో అందుబాటులోకి ఎక్స్‌రే సేవలు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి సీహెచ్‌సీలో ఎక్స్‌రే సేవలు మళ్లీ అందుబాటులోకి వచ్చాయి. భీమిలి సామాజిక ఆరోగ్య కేంద్రానికి (సీహెచ్‌సీ) అయిదేళ్ల క్రితం ఎక్స్‌రే పరికరం మంజూరైంది. వివిధ అనారోగ్య సమస్యలతో వచ్చే వారితో పాటు టీబీ వ్యాధిగ్రస్థులకు ఎక్స్‌రే తీస్తారు. ప్రస్తుతం అమల్లోకి వచ్చిన ఆధునిక ప్రక్రియ ద్వారా ఎక్స్‌రే తీసిన తర్వాత సంబంధిత ఫిల్మ్ ఇతర ప్రాంతాల్లో ఉన్న రేడియాలజిస్టుకు ఆన్‌లైన్ ద్వారా వెళ్తుంది. అక్కడ సమగ్రంగా పరిశీలించి తిరిగి ఆన్‌లైన్‌లో రిపోర్టును సీహెచ్‌సీకి పంపుతారు. దీన్ని స్థానిక వైద్యులు పరిశీలించి రోగికి అవసరమైన చికిత్స అందిస్తారు.

★ అయితే ఎక్స్‌రే విధులు నిర్వహించే రేడియోగ్రాఫర్ అప్పలాచారి రెండు నెలల నుంచి సెలవుల్లో ఉండడంతో అప్పటి నుంచి సేవలు నిలిచిపోయాయి. దీంతో రోగులు ప్రయివేటు క్లినిక్‌లను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడింది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా జిల్లాలోని అగనంపూడి సీహెచ్‌సీ నుంచి రేడియోగ్రాఫర్ నారాయణరావును ఇక్కడికి కేటాయించారు. దీంతో ఆయా సేవలు పునరుద్ధరించినట్లు భీమిలి సీహెచ్‌సీ వైద్యపర్యవేక్షక అధికారి డాక్టర్ ఎం.ఫణికుమార్ తెలిపారు.


ఆసుపత్రిలో ఎక్స్‌రే పరికరం

పగలూ వెలుగులే..

మధురవాడ, న్యూస్‌టుడే: మధురవాడ ఐటీ హిల్స్ రోడ్డులో మధ్య విభాజకంపై ఉన్న ఎల్‌ఈడీ విద్యుత్తు దీపాలు రెండు రోజులుగా పగలు, రాత్రి తేడా లేకుండా వెలుగుతూనే ఉన్నాయి. ఇప్పటికే చాలా కాలనీల్లో వీధి దీపాలు వెలగక అంధకారం నెలకొంటోంది. ఇక్కడ మాత్రం విరుద్ధంగా పగలు సైతం వెలుగులు పంచుతున్నాయి. సంబంధిత రోడ్డులో సుమారు 60కి పైగా దీపాలు ఇలా వెలుగుతూనే కనిపించాయి. జీవీఎంసీ వీధిదీపాల విభాగం అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


మధురవాడ ఐటీ హిల్స్ రోడ్డులో..


కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్థులు

దసరా ఉత్సవాలకు పందిరి రాట

గ్రామీణభీమిలి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణలో భాగంగా కొత్త మూలకుద్దు గ్రామంలో గురువారం పందిరి రాట వేశారు. గ్రామ పెద్దలు, మహిళలు, యువత పాల్గొన్నారు.

లోకేశ్ దృష్టికి నిర్మాణరంగ సమస్యలు

మధురవాడ, న్యూస్‌టుడే: నిర్మాణ రంగానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన కొత్త మెమోపై పునరాలోచన చేయాలని నగరానికి చెందిన పలువురు బిల్డర్స్ కోరారు. ఈ మేరకు బీచ్‌రోడ్డులోని ఓ రిసార్టులో ఉన్న రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను కలిసి గురువారం వినతిపత్రం అందించారు. కొత్త మెమో వల్ల తమపై ఆర్థిక భారం పడుతుందని, ఇప్పటికే నష్టాలు చవి చూస్తున్నామన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులో ఇటీవల వెలుగు చూసిన టీడీఆర్ కుంభకోణాన్ని వారు గుర్తు చేశారు. అక్కడ మున్సిపాలిటీ అధికారులు నిర్మాణదారులను ఇబ్బంది పెట్టేలా వ్యవహరించారని ఆవేదన వెలిబుచ్చారు. స్పందించిన లోకేశ్ ఈ మెమో జారీకి సంబంధించి ఇప్పటికే చర్చలు జరుగుతున్నాయన్నారు. బిల్డర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రముఖ నిర్మాణదారులు పి.వి.ఆదినారాయణ, పి.వెంకటమణి, పృథ్వీ, చాందీ, దిలీప్‌కుమార్ తదితరులున్నారు.


మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రం అందిస్తున్న నిర్మాణదారులు

వారణాసిలో శాస్త్ర పరిషత్ సభ


శాస్త్ర పరిషత్ సభలో పాల్గొన్న వేద పండితులు

అడివివరం (సింహాచలం): సింహాచలం దేవస్థానం విశ్రాంత ఆస్థాన పండితులు దివంగత బ్రహ్మశ్రీ వడ్లమాని వేంకటేశ్వర శర్మ జ్ఞాపకార్థం గురువారం కాశీ క్షేత్రంలో అధర్వవేద శాస్త్ర పరిషత్ సభ జరిగింది. బదరికాశ్రమ పీఠాధీశ్వరులు బ్రహ్మశ్రీ ఓరుగంటి గురు ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు వేద పండితులు పాల్గొని వేదసభ నిర్వహించారు. కాశీకి చెందిన రుగ్వేద, అధర్వవేద పండితులు బ్రహ్మశ్రీ గోపాల్‌రటాటే దంపతులను ఘనంగా సత్కరించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్రజా సంక్షేమమే కూటమి ధ్యేయం


తర్లువాడలో..

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ అయిదో వార్డు కొమ్మాది వైఎస్ఆర్‌నగర్‌లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా గురువారం తెదేపా కార్పొరేటర్ మొల్లి హేమలత ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. జోన్-2 జడ్సీ పి.సింహాచలం అధ్యక్షతన ఉమ్మడి కూటమి నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. తెదేపా రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణ్‌రావు, యూసీడీ ఏపీడీ ఎన్.గంగాధర్, సీవో ఆదినారాయణ, మాజీ కార్పొరేటర్ మన్యాల సోంబాబు, జనసేన, తెదేపా 5వ వార్డు అధ్యక్షులు దేవరశివ, నాగోతి వెంకటసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఆరో వార్డు సేవానగర్‌లో కాలనీ అధ్యక్షులు ఎ.ఉమామహేష్, కార్యదర్శి కె.భరత్‌కుమార్, జనసేన నాయకులు ఎస్.అరుణ్‌కుమార్ తదితరులు ప్రచార కార్యక్రమం చేపట్టారు.

ఆనందపురం, న్యూస్‌టుడే: తర్లువాడ గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. సర్పంచి బాలిరాంబాబు నాయుడు, తాత్రాజు అప్పారావు, పిల్లా చిన్నారావు, బి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస, న్యూస్‌టుడే: రెండోవార్డు సంతపేట ఎన్టీఆర్ పార్కులో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం గురువారం జరిగింది. జోనల్ కమిషనరు పి.ప్రేమ ప్రసన్నవాణి హాజరయ్యారు. తెదేపా కార్పొరేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి, ఏపీడీ సంతోశ్‌కుమార్, తెదేపా మాజీ కౌన్సిలర్లు పిట్టా వెంకటరావు, బడిగంట నీలకంఠం, జనసేన వార్డు అధ్యక్షుడు నీలాపు శంకరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


రెండో వార్డు సంతపేట ఎన్టీఆర్ పార్కు వద్ద..


వైఎస్ఆర్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ హేమలత, జడ్సీ సింహాచలం తదితరులు


సేవానగర్‌లో..

కృష్ణాకాలనీలో రెండు బడ్డీల దగ్ధం

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి కృష్ణాకాలనీ వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో రెండు బడ్డీ దుకాణాలు కాలిపోయాయి. ఇక్కడ వియ్యపు తవుడు అనే వ్యక్తి 20 ఏళ్లుగా కిరాణా దుకాణం నిర్వహిస్తున్నారు. రాత్రి 10 గంటలకు దుకాణాన్ని మూసివేసి ఇంటికెళ్లగా అర్ధరాత్రి దాటాక దుకాణం నుంచి పొగలు రావడాన్ని గమనించిన వ్యక్తులు తవుడికి సమాచారమిచ్చారు. ఫిర్యాదు మేరకు చిట్టివలస అగ్నిమాపక అధికారులు వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే దుకాణంలోని రెండు ఫ్రిజ్‌లు, పప్పుదినుసులు, ఇతరత్రా వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. దీని పక్కనే ఉన్న పీతల వెంకటరావుకు చెందిన టైలర్ దుకాణానికి మంటలు వ్యాపించడంతో పాక్షికంగా దగ్ధమైంది. ఈ ప్రమాదానికి విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ లేదా గిట్టని వ్యక్తులు పెట్రోలు పోసి నిప్పు అంటించారా అన్న విషయాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఘటనా ప్రాంతానికి గురువారం భీమిలి ఎస్.ఐ. ఎన్.గౌరి విచ్చేసి పరిశీలించారు. రూ.5 లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు భావిస్తున్నారు. బాధితులను అధికారులు ఆదుకోవాలని తెదేపా రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు విజ్ఞప్తి చేశారు.


ధ్వంసమైన దుకాణం వద్ద బాధితుడు

క్లౌడ్ కంప్యూటింగ్‌లో ఉపాధి అవకాశాలు మెండు

కొమ్మాది, న్యూస్‌టుడే: రానున్న కాలంలో క్లౌడ్ కంప్యూటింగ్‌లో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని అందుకు అనుగుణంగా విద్యార్థులు జ్ఞాన సముపార్జన పెంచుకోవాలని నిపుణులు సూచించారు. పీఎంపాలెంలోని బాబా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (బిట్స్‌వైజాగ్) ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్సు విభాగం ఆధ్వర్యంలో మూడురోజుల పాటు జరగనున్న జాతీయ కార్యశాలను గురువారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన క్లౌడ్ కంప్యూటింగ్ నిపుణులు టి.నిఖిల, రామ్‌కౌశిక్, బిజన్‌సింగాలు విద్యార్థులకు అమెజాన్ వెబ్ సర్వీస్, క్లౌడ్ కంప్యూటింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కొండ్రు శ్రీలక్ష్మి, ప్రిన్సిపల్ డాక్టర్ బి.పూర్ణ సత్యనారాయణ మాట్లాడారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే సమకాలీన అంశాలకు తగ్గట్లుగా నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. కన్వీనర్ జాషువరాజు తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న క్లౌడ్ కంప్యూటింగ్ నిపుణులు

అంగన్‌వాడీ కేంద్రాల్లో సీమంతాలు

కొమ్మాది, న్యూస్‌టుడే: ఐసీడీఎస్ భీమిలి ప్రాజెక్టు ఆధ్వర్యంలో మధురవాడ సెక్టార్ కొమ్మాది గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలు గురువారం నిర్వహించారు. సీడీపీవో ఎం.శ్రీదేవి సారథ్యంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులకు సీమంతాలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

విశాఖ తూర్పు

మన్యంధీరుడు సినిమా యూనిట్ సందడి

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : మన్యం ధీరుడు సినిమా సక్సెస్ మీట్ కార్యక్రమం మద్దిలపాలెం సి.ఎం.ఆర్. ఐనాక్స్‌లో జరిగింది. ఈ సినిమా అన్నిచోట్ల విజయవంతంగా ప్రదర్శించబడుతుందని హీరో, నిర్మాత ఆర్.వి.వి.ఆర్.సత్యనారాయణ అన్నారు. దర్శకుడు డెక్కల నరేష్ మాట్లాడుతూ.. సినిమా తీస్తున్నప్పుడు తాము పడ్డ కష్టమంతా ప్రేక్షకులు చూపిస్తున్న ఆదరణతో మరిచిపోయామన్నారు. సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు, జబర్దస్త్ అప్పారావు, సత్తిపండు తదితరులు పాల్గొన్నారు.

చదువుతూ.. సేవలో తరిస్తూ...

దత్తత ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు



స్వచ్ఛభారత్‌లో భాగంగా బీచ్‌లో వ్యర్థాల సేకరణ

ఓ వైపు చదువుకుంటూనే.. మరోవైపు సామాజిక కార్యక్రమాల్లో కూడా విద్యార్థులు భాగస్వాములవుతున్నారు. డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్. విద్యార్థులు నగరంలోని కొన్ని ప్రాంతాలను దత్తత తీసుకుని అక్కడ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

– న్యూస్‌టుడే, హెచ్‌బీకాలనీ, (మద్దిలపాలెం)

దత్తత తీసుకున్న ప్రాంతాలు..

16వ వార్డులో ఇసుకతోట, రెల్లివీధి, అంబేడ్కర్‌నగర్, మద్దిలపాలెం, హెచ్‌బీకాలనీ, చాకలిపేట, కేఆర్‌ఎం.కాలనీ ప్రాంతాలను ఈ ఎన్.ఎస్.ఎస్. విద్యార్థులు దత్తత తీసుకుని పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ★ డెంగీ, మలేరియా వంటి విష జ్వరాల సమయంలో ఆయా ప్రాంతాల్లో ఈ ఎన్.ఎస్.ఎస్. విద్యార్థులు విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఎవరైనా అనారోగ్యంగా ఉంటే వారిని మెరుగైన చికిత్సకు సిఫార్సు చేస్తున్నారు. ★ ఇప్పటికీ మూఢ నమ్మకాల వల్ల చిన్న వయసులోనే వివాహాలు చేయటం వంటి సామాజిక రుగ్మతల నుంచి ప్రజలను చైతన్యవంతులు చేసే దిశగా ఎన్.ఎస్.ఎస్. విద్యార్థులు కృషిచేస్తున్నారు. ★ బడి ఈడు ఉన్న విద్యార్థులను బడికి పంపని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేసి వారికి చదువు విలువ తెలియజేసి వారిని బడికి వెళ్లేలా ప్రోత్సహిస్తున్నారు. ★ స్వచ్ఛభారత్, బహిరంగ మలవిసర్జన నిర్మూలన, పచ్చదనం పెంపు వంటి అవగాహన కార్యక్రమాలు కూడా ఎన్.ఎస్.ఎస్. విద్యార్థులు నిర్వహిస్తుంటారు.



పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరిస్తూ...

ఉత్తమ వాలంటీరుగా...



కృష్ణా డిగ్రీ కళాశాలలో ఎం.పి.సి.ఎస్. తృతీయ సంవత్సరం చదువుతున్నాను. గడిచిన రెండేళ్లలో దత్తత తీసుకున్న ప్రాంతాల్లో అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నాను. ఈ ఏడాది విశాఖ జిల్లాకే ఎన్ఎస్ఎస్‌లో ఉత్తమ వాలంటీరు అవార్డును ఆగస్టు 15న అందుకున్నాను. ఇది ఎంతో ఆనందం కలిగిస్తోంది.

– ఎ.చూడామణి, ఎంపీసీఎస్, తృతీయ సంవత్సరం


చదువుతో పాటు సేవ..



చదువు విజ్ఞానం నేర్పిస్తే.. సామాజిక సేవ మనసుకు తృప్తి కలిగిస్తుంది. మనం చదువుకోవడమే కాకుండా మనతో పాటు అందరూ చదువుకోవాలనే ఉద్దేశంతో బడి ఈడు పిల్లల్ని బడిలో చేర్పించేలా దత్తత గ్రామాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నాం. ఇప్పుడు చేస్తున్న సేవ మాకు భవిష్యత్తులోనూ మంచి కార్యక్రమాలు చేయడానికి దోహదపడుతుందనుకుంటున్నాను.

–ఎన్.దేవాశిష్, బీఏ ద్వితీయ సంవత్సరం

అందరి సహకారంతో...



కళాశాల ప్రిన్సిపల్, ఇతర అధ్యాపకులందరి సహకారంతో విద్యార్థులను ఎన్.ఎస్.ఎస్.లో భాగస్వాముల్ని చేస్తూ.. వారిలో సేవాభావం పెంపొందేలా కృషిచేస్తున్నాం. ఇది మాకు అవార్డుల సాధనకు కూడా దోహదపడుతోంది. ఈ సేవా కార్యక్రమాల వల్ల రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఎన్ఎస్ఎస్ అవార్డు, జిల్లాస్థాయి, ఏయూ పరిధిలో అవార్డు సాధించడం గర్వకారణంగా ఉంది.

– డాక్టర్ పోలా ఉమామహేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి

యువతకు న్యాయ పరిజ్ఞానం ఎంతో అవసరం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్ర విశ్వవిద్యాలయం యూజీసీ సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఇన్‌క్లూజన్‌లో గురువారం 'యువత అభివృద్ధి, సామాజిక చేరిక' అన్న అంశంపై ఉపన్యాస కార్యక్రమం జరిగింది. ఏయూ న్యాయ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సీతామాణిక్యం మాట్లాడుతూ.. యువతలో న్యాయ పరిజ్ఞానం ఎంతో అవసరమన్నారు. దేశ ప్రగతికి సుప్రీంకోర్టు తీర్పులను ఆమె ప్రస్తావించారు. కార్యక్రమంలో మిజోరం యూనివర్సిటీ సోషల్ వర్క్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ కొట్టు శేఖర్, కేంద్ర ఇన్‌ఛార్జి డైరెక్టర్ పి.సుబ్బారావు, డాక్టర్ బాబావలి, డాక్టర్ బి.శివరామకృష్ణ, డాక్టర్ జి.శాంతారావు, ఏయూ జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్, సోషియాలజీ, న్యాయ విభాగాల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM

ఎంవీపీకాలనీ 80085 74768 మద్దిలపాలెం 99121 20229

–న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

★ సమస్య : హెచ్.బి.కాలనీ సింహాద్రిపురం కొండవాలులో 68ఎ/1/1/2 పోల్‌పై వీధి దీపాలు వెలగటం లేదు. – సుధాకర్

★ సమాధానం: పరిశీలించి మరమ్మతులు చేపడతాం. – విక్రాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్

★ సమస్య : ఎంవీపీకాలనీ ఫైలాన్ కూడలిలో బస్‌స్టాప్ వద్ద వర్షపు నీరు నిలిచిపోతుంది. – శ్రీరామ్

★ సమాధానం: సిబ్బందిని నియమించి, వర్షపు నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకుంటాం.

– సత్యనారాయణ, శానిటరీ సూపర్‌వైజర్

లుంబినీపార్కులో స్వచ్ఛతాహీ సేవ

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా లుంబినీపార్కులో స్వచ్ఛభారత్ నిర్వహించారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం లుంబినీపార్కులో చేపట్టిన స్వచ్ఛభారత్‌ను జెడ్సీ శివప్రసాద్, కార్పొరేటర్ మంగవేణిలు పాల్గొని ప్రారంభించారు. ఎ.ఎస్.రాజా మహిళా జూనియర్ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు పాల్గొని స్వచ్ఛభారత్ పేరిట పార్కు ఆవరణను శుభ్రం చేశారు. ప్రతీ ఒక్కరూ తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని నినాదాలు చేశారు. ప్రిన్సిపల్ ఎం.కాసు, ప్రజారోగ్య విభాగ సిబ్బంది పాల్గొన్నారు.



పార్కును శుభ్రం చేస్తున్న జెడ్సీ, తదితరులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కేఆర్‌ఎం.కాలనీ, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే : పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యవంతులుగా నిలవాలని ఇండియన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ ఎం.వి.వి.మురళీమోహన్ అన్నారు. గురువారం కృష్ణా డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సహకారంతో, గ్రీన్‌క్లైమెట్ బృందంతో కలిసి స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా పలు కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఇంజినీర్ పి.శ్రీలక్ష్మీ, అధ్యాపకులు పాల్గొన్నారు.



బ్యానర్ పట్టుకున్ని అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అ వీ ఇ వీ


విద్యార్థికి అభినందనలు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఇటీవల నెల్లూరులో జరిగిన ఆల్ ఇండియా చెస్ టోర్నమెంట్‌లో ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో గల డిగ్రీ కళాశాలలో బి.బి.ఎ. చదువుతున్న విద్యార్థి ఆదిత్య వరుణ్ ప్రథమ స్థానంలో నిలిచాడు. దీంతో ఆ విద్యార్థిని కళాశాల ప్రతినిధులను, ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎస్.ధనుంజయరావు అభినందించారు.

బి.ఒ.ఎస్. ఛైర్మన్‌గా నానాజీరావు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్రవిశ్వవిద్యాలయం గణితశాస్త్ర విభాగం బి.ఒ.ఎస్. ఛైర్మన్‌గా ఆచార్య జి.నానాజీరావు నియమితులయ్యారు. ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు ఆదేశాలతో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు తన కార్యాలయంలో నానాజీరావుకు అందజేసి అభినందించారు.

వెంకటమణికి తానికొండ కథా పురస్కారం



ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : తానికొండ నాగయ్య స్మారక కథల పోటీ విజేతగా నగరానికి చెందిన రచయిత **వెంకటమణి** నిలిచారు. ఆయన రాసిన ఊరు చివరమనిషి కథకి ప్రథమ శ్రేణి బహుమతి దక్కింది. నేటి సమాజంలో దళితుల స్థితిగతులు ఏరీతిన ఉన్నాయనేది ఈ కథ సారాంశం. ఈ పోటీకి ప్రముఖ రచయిత, కథా విశ్లేషకుడు శ్రీకంఠస్ఫూర్తి న్యాయనిర్ణేతగా వ్యవహరించారు.

ఆర్టీసీ ఛైర్మన్‌ను కలిసిన ఎన్ఎంయూ నాయకులు

స్వర్ణభారతి, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే : ఆర్టీసీ ఛైర్మన్‌గా నియమితులైన మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణను గురువారం ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) నాయకులు మచిలీపట్నంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి గజమాలతో సత్కరించారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ రాష్ట్ర నాయకులు పీవీ రమణారెడ్డి, శ్రీనివాసరాజు, పీవీ మోహన్, ఆర్.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



కొనకళ్ల నారాయణను గజమాలతో సత్కరిస్తున్న ఎన్ఎంయూ నాయకులు

భారీ వర్షానికి రహదారులు జలమయం...



పెదగదిలి కూడలి దగ్గర చెరువుని తలపిస్తున్న బీఆర్టీఎస్ రోడ్డు



వర్షపు నీటితో నిండిన ఆళ్వార్‌దాస్ కూడలి

ఎడతెరిపిలేకుండా బుధవారం అర్ధరాత్రి దాటిన నుంచి కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు నీటితో నిండిపోగా, ఎక్కువ సమయం వర్షం కురవడంతో వెంకోజీపాలెం కొండవాలు ప్రాంతం కాస్త కుంగి, గోడలు కూలాయి. ఈ సంఘటనలో ఎవరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. గురువారం ఉదయం సమయంలో సుమారు 2 గంటల పాటు భారీ వర్షం కురవటంతో రహదారులు పూర్తిగా జలమయమయ్యాయి. వర్షపు నీరు రహదారులపై పొంగిపొర్లింది.

– న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ, ఆరిలోవ, మద్దిలపాలెం



జలమయంగా ఎంవీపీలోని ఓ వీధి



వెంకోజీపాలెంలో దెబ్బతిన్న మెట్ల మార్గం




వర్షపునీటిలో వాహనాల రాకపోకలు



కృష్ణా కళాశాల ప్రధాన ముఖద్వారం వద్ద వర్షపు నీరు

కొండవాలులో గుండె గుబులు

నగరంలో వర్షం పడితే ప్రధానంగా కొండవాలు ప్రాంతాల్లో ఉన్న వారంతా భయం.. భయంగా గడుపుతారు. కొండ కరిగి ఎక్కడ రాళ్లు వచ్చి మీద పడతాయోనని భయపడుతుంటారు. ప్రమాదం చాటునే నివాసాలు ఉంటాయి. ఏకధాటిగా వర్షాలు కురుస్తున్న ప్రస్తుత సమయంలో ఇటువంటి ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాల్సిందే మరి. వెంకోజీపాలెంలో ఉన్న కొండవాలు ప్రాంతంలోనిది ఈ చిత్రం. – ఈనాడు, విశాఖపట్నం



ఇంటింటికి 'ఇది మంచి ప్రభుత్వం'

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 15వ వార్డులో కూటమి నాయకులు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. గురువారం సాయంత్రం నుంచి సింహాద్రిపురం, లక్ష్మీనరసింహనగర్ వంటి ప్రాంతాల్లో వార్డు అధ్యక్షులు బుగత సత్యనారాయణ నేతృత్వంలో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



15వ వార్డులో కరపత్రాలను పంచుతూ..



12వ వార్డులో కూటమి నాయకుల ప్రచారం

ఆరిలోవ, న్యూస్‌టుడే: 13వ వార్డు పరిధి ఆరిలోవ లక్ష్మీనగర్, ఏఎస్సార్‌నగర్, సాయినగర్, శివశంకర్‌నగర్, గణేష్‌నగర్, సిద్ధార్థనగర్ ప్రాంతాల్లో కూటమి పార్టీల నాయకులు కాలనీల్లో పర్యటించారు. 12వ వార్డు పరిధి జ్యోతినగర్, మయూరినగర్, అంబేడ్కర్‌నగర్, కోకోకోలా లేఅవుట్ కాలనీల్లో ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.

త్రీటౌన్ పోలీసు స్టేషన్ సందర్శించిన సీపీ



స్టేషన్‌ను పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: మూడో పట్టణ పోలీసు స్టేషన్‌ను నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ గురువారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్లోకి వెళ్లి గదులు పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల గురించి సి.ఐ. రమణయ్యను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు సత్వర న్యాయం అందించాలని, స్టేషన్‌కు వచ్చిన వారితో గౌరవంగా మాట్లాడాలన్నారు. సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలపై ఆరాతీశారు.

విశ్రాంత హోంగార్డుకు ఆర్థిక భరోసా

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : నగర పోలీసు కమిషనరేట్ హోమ్‌గార్డుగా విధులు నిర్వహించిన పి.జగన్నాథరావు జూన్ నెలలో పదవీ విరమణ చేశారు. హోంగార్డుల సంక్షేమం నిమిత్తం వారి ఒకరోజు వేతనం రూ.6.54 లక్షల మేర మొత్తాన్ని జగన్నాథరావుకు సీపీ శంఖబ్రత బాగ్చీ అందజేశారు.



చెక్కు అందజేస్తున్న సి.పి. శంఖబ్రత బాగ్చీ

డీఆర్ఎం తనిఖీలు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: తూర్పు కోస్తా రైల్వే వాల్తేర్ డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ గురువారం విజయనగరం-రాయగడ సెక్షన్‌లో భద్రతా తనిఖీలు నిర్వహించారు. డివిజన్‌కు చెందిన ఇంజినీరింగ్, అపరేషన్, కమర్షియల్, భద్రత, మెకానికల్, సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్స్, ఎలక్ట్రికల్ విభాగాలకు సంబంధించిన ఉన్నతాధికారులతో కలిసి ఈ తనిఖీలు చేశారు. భద్రతా నియమాల అమలు తీరును పరిశీలించారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్ర విశ్వవిద్యాలయం బొల్లినేని మెడ్‌స్కిల్స్ సహకారంతో 2024-25 విద్యా సంవత్సరానికి స్వీయ మద్దతుగల కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏయూ ప్రవేశాల సంచాలకులు ఆచార్య డి.ఎ.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఏయూ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. దరఖాస్తులకు చివరి తేదీ అక్టోబరు 15. మరిన్ని వివరాలకు ఏయూ వెబ్ సైట్ పరిశీలించాలని కోరారు.

28న నాటిక ప్రదర్శన

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: అమాయకత్వం, నేర్పరితనం, చమత్కారం లాంటి అంశాలపై 'టీ విత్ ఎవ్రిథింగ్' నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు డైరెక్టర్ మాల పాషా తెలిపారు. బీచ్‌రోడ్డు పార్క్‌హోటల్లో గురువారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. 28న పార్క్ హోటల్లో సాయంత్రం 7.30 గంటలకు నాటిక ప్రదర్శిస్తారన్నారు. టెక్నికల్ డైరెక్టర్ జోయ్‌దీప్, బెనర్జీ, జయదీప్ బిశ్వాస్ పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

- సీఐటీయూ డిమాండ్

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : విమ్స్ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బందికి కనీస వేతనం రూ. 26వేలు అమలు చేయాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా విమ్స్ ఆసుపత్రి గేటు వద్ద గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. శానిటేషన్ కార్మికులు, సీఐటీయూ కమిటీ ప్రతినిధులతో కలిసి నినాదాలు చేశారు. అనంతరం ఈనెల 30వ తేదీ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహించనున్న మహాధర్నా గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాజేశ్వరి, కనకరాజు, అన్నపూర్ణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మహాధర్నా గోడపత్రిక ప్రదర్శిస్తున్న సీఐటీయూ ప్రతినిధులు

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న కార్మికులు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: నాలుగు నెలలుగా ఇసుక లభ్యత సరిగా లేక భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక పస్తులుంటున్నందున వీరిని ఆదుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు డిమాండ్ చేశారు. పదోవార్డు రవీంద్రనగర్ కూడలిలో గురువారం ఉదయం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో వారు నినాదాలు చేశారు. జోన్ కార్యదర్శి నరేంద్ర కుమార్, సీఐటీయూ ప్రతినిధులు రమణ నాగరాజు, రాము, సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

బంగారు స్వామికి వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: భక్తుల కొంగు బంగారంగా సింహగిరిపై వెలుగొందుతున్న అప్పన్న స్వామికి గురువారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని శోభాయమానంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో దేవతామూర్తులకు అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం అదే వేదికపై స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. గురువారం సందర్భంగా అంతరాలయంలో స్వామి బంగారు శాంత నృసింహ కవచం అలంకరణలో భక్తులను అనుగ్రహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు నృసింహావతార మూర్తిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



విశాఖ ఉత్తరం

• విశాఖ ఉత్తరం • విశాఖ దక్షిణం

ధర్మ కాటాల తనిఖీ



గురుద్వారా, న్యూస్‌టుడే: సీతమ్మధార రైతుబజార్‌లో తూనికల కొలతల శాఖ అధికారులు గురువారం ధర్మకాటాల తనిఖీలు నిర్వహించారు. శాఖ ఇన్‌స్పెక్టర్ రామారావు రైతులు తూనికలకు వినియోగించే కాటాల ముద్రను పరిశీలించారు. తప్పనిసరిగా ముద్ర వేయించుకోవాలని సూచించారు. తూనికల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో శాఖ సిబ్బంది, ఎస్టేట్ అధికారి కొండబాబు, సహాయకుడు సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

కాటాలను తనిఖీ చేస్తున్న అధికారి రామారావు, తదితరులు

29న ఉచిత వైద్య శిబిరం

మురళీనగర్, న్యూస్‌టుడే : మహిళా వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాధవధార కోదండ రామాలయం ప్రాంగణంలో జరిగే ఈ శిబిరంలో అపోలో ఆసుపత్రి వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహిస్తారని క్లబ్ అధ్యక్షులు ఎస్.లలితారెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని జంటకాలనీవాసులు వినియోగించుకోవాలని కోరారు.

గురుద్వారా, న్యూస్‌టుడే: ఎబాట్, టొరెంట్, ఫ్రాంకో ఇండియన్ వంటి ప్రముఖ సంస్థలు, వైద్యుడు ఎస్.రహ్మోతుల్లా సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీ ఆదివారం 24వ వార్డు గాంధీనగర్‌లో ఉచిత వైద్యశిబిరం జరుగుతుందని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. బి.ఎం.డి, థైరాయిడ్, బ్లడ్‌షుగర్, యూరిక్ యాసిడ్ వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. వివరాలకు 98669 70816, 70132 51613 ఫోన్ నెంబర్లలో సంప్రదించాల్సిందిగా కోరారు.

రోడ్ల పైకి కొట్టుకొచ్చిన చెత్తా చెదారం



ఎనబై అడుగుల రోడ్డులో నిలిచిపోయిన వర్షపు నీరు

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే

నగరంలో గురువారం కురిసిన భారీ వర్షానికి తాటిచెట్లపాలెం పరిసర ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. తాటిచెట్లపాలెం ఎనబై అడుగుల రోడ్డు, రైల్వేన్యూకాలనీ ప్రాంతాల్లో రహదారుల మీద ఎక్కడికక్కడ వర్షం నీరు నిలిచిపోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పాదచారులు వర్షపు నీటిలోనే రాకపోకలు సాగించాల్సి వచ్చింది. ఈ కారణంగా వార్డుల్లో పారిశుద్ధ్య సమస్య విషమించింది. రైల్వేన్యూకాలనీ ప్రాంతంలో ఎర్రిగెడ్డ పొంగి ప్రవహించింది. మసీద్‌వీధి, హరగోపాల్ పాఠశాల రోడ్డు, చంద్రనగర్‌లో గెడ్డలోంచి మురుగు నీరు సమీపంలోని ఇళ్లల్లోకి రావడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీంతో ఈ సమస్యను కాలనీ నాయకులు జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో శానిటరీ అధికారులు వెంటనే స్పందించి ఇక్కడ సిబ్బందితో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పొక్లెయిన్‌తో వర్షంలోనే గెడ్డలోని పూడికను తొలగించి ముంపు సమస్యను పరిష్కరించారు. లేదంటే ఈ ప్రాంతంలో ఇళ్ల మధ్యలోంచి ఉన్న ఎర్రిగెడ్డ వల్ల కాలనీల్లోకి నీరు చేరి పలు గృహాలు దెబ్బతినేవని కాలనీ నాయకులు తెలిపారు. తాటిచెట్లపాలెం - ధర్మానగర్ రోడ్డులో వర్షపు నీరు ఎక్కడికక్కడ నిలిపోడంతో రోడ్డంతా గోతులమయంగా తయారైంది. దీంతో వాహన చోదకులు, కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. నగరంలో భారీ వర్షం కురిసినప్పుడల్లా తమకు ఈ ఇక్కట్లు తప్పడం లేదని కాలనీ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.



వర్షానికి నిండుగా ప్రవహిస్తున్న ఎర్రిగెడ్డ

సీతంపేట, న్యూస్‌టుడే

సమస్య: 25వ వార్డు రాజేంద్రనగర్‌లో చైతన్య అపార్ట్‌మెంట్ వద్ద గల వీధి విద్యుత్తు దీపం వారం రోజులుగా వెలగడంలేదు. దీంతో ఈ వీధిలో చీకటి అలముకొంది.

– ఎ. శ్యామలరాణి, స్థానికురాలు, రాజేంద్రనగర్

సమాధానం: ఒకటి, రెండు రోజుల్లో బాగు చేయిస్తాం.

– ప్రసాద్, ఏఈ, విద్యుత్తు శాఖ, జీవీఎంసీ

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM - 1 PM

విశాఖ ఉత్తరం: 80747 24699

విశాఖ దక్షిణం: 80085 66543

గురుద్వారా, న్యూస్‌టుడే

సమస్య: సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్ అభయాంజనేయస్వామి ఆలయం సమీప రహదారి మధ్యలో గొయ్యి ప్రమాదకరంగా ఉంది. ప్రమాద సూచిక లేకపోవడంతో వాహనదారులు గుంతలో దిగిపోతున్నారు.

– శ్రీనివాస్‌రాజు (స్థానికుడు)

సమాధానం: సమస్యను పరిశీలించి గుంతను పూడ్చే చర్యలు తీసుకుంటాం.

– ఇంజినీర్ విభాగం ఏఈ (14వ వార్డు)

అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన కొనసాగుతుందని ఉత్తరం నియోజకవర్గం ఎమ్మెల్యే పెన్మెత్స విష్ణుకుమార్‌రాజు పేర్కొన్నారు. గురువారం అక్కయ్యపాలెం అబిడ్‌నగర్‌లోని పాఠశాలలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తున్నామన్నారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైనా ఆయినా ముఖ్యమైన హామీలు నెరవేరుస్తున్నామన్నారు. అవినీతి ఎక్కడుంటే జగన్‌మోహన్‌రెడ్డి, అతని అనుచరులు అక్కడ ఉంటూ రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో తెదేపా, భాజపా, జనసేన నాయకులు పసుపులేటి ఉషాకిరణ్, ఎం.డి.నజీర్, కొయిలాడ వెంకటేష్, ఈతలపాక సుజాత, శ్యామలదీపిక, మాదేటి కనకారావు, కార్పొరేటర్ ముక్కా శ్రావణి, రుమురామరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు

పోర్టు హాస్పిటల్‌ను సొంత నిధులతో అభివృద్ధి చేయాలి



పోర్టు హాస్పిటల్ వద్ద టెండర్ల ప్రతులను దగ్ధం చేస్తున్న పోర్టు కార్మిక సంఘం నాయకులు

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే : విశాఖ పోర్టు హాస్పిటల్‌ను పి.పి.పి. పద్ధతిలో కాకుండా పోర్టు తన సొంత నిధులతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని సీఐటీయూ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి బి.జగన్ డిమాండ్ చేశారు. సాల్గ్రామపురం పోర్టు హాస్పిటల్ వద్ద గురువారం పోర్టు ఆసుపత్రిని ప్రయివేటీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం టెండర్లు పిలుస్తున్నందుకు నిరసనగా యునైటెడ్ పోర్ట్స్ అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి టెండర్ల పత్రాలను దగ్ధం చేశారు. యునైటెడ్ పోర్ట్స్ అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె. సత్యనారాయణ మాట్లాడుతూ ప్రయివేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. ఆర్గనైజింగ్ కార్యదర్శులు వి.రామలింగేశ్వరరావు, త్రినాథ్, వి.డి.ఎల్.బి.అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జక్కన్న, సత్యనారాయణ, బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

గీత కులాలకు 10శాతం మద్యం దుకాణాలపై హర్షం

సీతంపేట, న్యూస్‌టుడే : మద్యం దుకాణాల్లో శెట్టిబలిజలకు రాయితీలు కల్పిస్తున్నందున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి శెట్టిబలిజ సంక్షేమ సంఘం గురువారం క్షీరాభిషేకం చేసింది. ఆ సంఘం సీనియర్ నాయకులు కట్టా మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో విశాఖ పౌరగ్రంథాలయంలో ఈ అభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ గీత కులాలకు మద్యం షాపుల్లో పదిశాతం దుకాణాలు, 50శాతం రాయితీపై ఇవ్వడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయించారని ఈ నేపథ్యంలో ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేసినట్లు తెలిపారు. బీసీలకు 33 శాతం చట్టసభల్లో రిజర్వేషన్ కల్పిస్తామని ప్రకటించడం 139 కులాల్లో ఆనందం వ్యక్తం అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కడలి సుబ్బారావు, కట్టా శ్రీకాంత్, కంకటాల బాలసాయి, కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, మధు గౌడ, బొమ్మిడి రమణ తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కట్టా మల్లేశ్వరరావు

సంక్షేమ పాలనకే ప్రాధాన్యం

మాధవధార, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమ పాలనకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని, 100 రోజుల పాలన ద్వారా పేదలకు చేరువయ్యామని నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు పేర్కొన్నారు. గురువారం మాధవధార మాధవస్వామి కల్యాణ మండపంలో జీవీఎంసీ 49,50,51 వార్డులకు సంబంధించి నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విజయవాడ వరదల్లో సేవలందించిన పలువురు పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్, 50,51వ వార్డుల తెదేపా అధ్యక్షులు సపపల వరప్రసాద్, కీర్తి, పి.శ్రీనివాసరావు, జెడ్పీ బి.రాము తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు

నేడు బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ సొసైటీ మహాజనసభ

మురళీనగర్, న్యూస్‌టుడే: బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ సొసైటీ 65వ వార్షిక మహాజన సభ శుక్రవారం సాయంత్రం 5గంటలకు జరగనుంది. డాబాగార్డెన్స్ సంస్థ ప్రధాన కార్యాలయ ఆవరణలో జరిగే ఈ సమావేశంలో ఏప్రిల్ 2024 నుంచి సెప్టెంబర్ 24 మధ్య ఉద్యోగ విరమణ పొందిన సభ్యులకు సన్మానం, 2023-24 ఆర్థిక సంవత్సరంలో అర్హతగల సభ్యుల పిల్లలకు విద్యా పురస్కార బహుమతులు అందజేస్తారు. పూర్వ సొసైటీ నాయకులు, ఉద్యోగులు హాజరుకావచ్చునని కార్యదర్శి బి.ఎస్.చక్రవర్తి కోరారు.

బీసీల మహాధర్నాను జయప్రదం చేయండి

గురుద్వారా, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుల గణన నిర్వహించాలని కోరుతూ విజయవాడలో అక్టోబర్ 9న నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ విశాఖపట్నం అధ్యక్షులు పెదపెంకి శివప్రసాదరావు పిలుపునిచ్చారు. గురువారం సీతమ్మధార పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ధర్నా తాలూకా కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సీనియర్ బీసీ నాయకులు కట్టా మల్లేశ్వరరావు, పార్టీ ప్రధాన కార్యదర్శి అన్వేశ్, ధనుంజయరావు, ఉపాధ్యక్షులు రామచంద్రరావు, కోశాధికారి కనకమహాలక్ష్మి, ఉత్తరం సమన్వయకర్త రమేశ్, కార్యదర్శి తాతారావు, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరణలో మల్లేశ్వరరావు, శివప్రసాదరావు, తదితరులు



భవానీగార్డెన్స్ యూపీహెచ్‌సీ వద్ద వైద్యులు, సిబ్బంది

వైద్య సేవల్లో భవానీగార్డెన్స్ యూపీహెచ్‌సీకి ప్రథమ స్థానం

మాధవధార, న్యూస్‌టుడే: ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న భవానీ గార్డెన్స్ పట్టణ ప్రాథమిక వైద్య కేంద్రంలో రోగులకు అందించిన వైద్య సేవల్లో జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచినట్లుగా ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ ఏ.ఎల్.శాంతి తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం నియమించిన నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్(ఎన్‌క్యూఏఎస్) వైద్య బృందం ఈ నెల 4,5 తేదీలో జిల్లాలో ఉన్న అన్ని యూపీహెచ్‌సీలను పరిశీలించారన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో 12 అంశాలకు సంబంధించి ప్రజలకు అందిస్తున్న సేవలను గురించి పరిశీలన చేశారని తెలిపారు. ఇందులో 91శాతం మార్కులు పొంది భవానీ గార్డెన్స్ యూపీహెచ్‌సీ ప్రథమ స్థానంలో నిలిచిందని, సిబ్బంది సహకారంతోనే ఇది సాధించినట్లుగా ఆమె తెలియజేశారు.

మంత్రికి వార్డు విద్యా కార్యదర్శుల సంఘం వినతి

గురుద్వారా, న్యూస్‌టుడే: వార్డు విద్యా కార్యదర్శుల్ని విద్య, అనుబంధ శాఖకి అనుసంధానిస్తూ ఓ శాఖని, హెచ్‌వోడీని చూపించమని మంత్రి నారా లోకేశ్‌కు ఏపీ వార్డు విద్యాశాఖ కార్యదర్శుల సంఘం సభ్యులు కోరారు. గురువారం నగరంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యాశాఖకు సంబంధించిన పరీక్ష ద్వారా వార్డు ఎడ్యుకేషన్ కార్యదర్శులు నియమితులయ్యారని.. వారికి శాఖాపరమైన అధికారిపై నెలకొన్న అనిశ్చితిని తొలగించాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు సురేశ్‌కుమార్, విశాఖ జిల్లా అధ్యక్షులు రాజబాబు, కార్యదర్శి రాజేశ్, జిల్లా కార్యవర్గ సభ్యులు నూతనకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

టార్పాలిన్ లేకుండా సరకులు రవాణా చేస్తే జరిమానా

మాధవధార, న్యూస్‌టుడే: ఇసుక, బొగ్గు ఇతర సరకులను రవాణా చేసేటప్పుడు తప్పనిసరిగా టార్పాలిన్ కప్పాలని, లేకపోతే రూ.11వేలు జరిమానాతో పాటు, వాహన పర్మిట్ రద్దు చేస్తామని డీటీఓ జి.సి.రాజారత్నం తెలియజేశారు. టార్పాలిన్ కప్పకుండా సరకులు తీసుకువెళ్లడం వల్ల అవి బయటకు ఎగిరి రాకపోకలు సాగించే చోదకులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు. తప్పని సరిగా సరకులు రవాణా చేసేటప్పుడు టార్పాలిన్ వేయాలని సూచించారు.

స్వయంకృషితో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

కంచరపాలెం, న్యూస్‌టుడే: విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే స్వయం కృషితోనే సాధ్యమని డాక్టర్ వి.మురళీకృష్ణ తెలిపారు. గురువారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ ఫ్రెషర్స్‌డే వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ సమాజ నవనిర్మాణంలో ఇంజినీరింగ్ విద్యార్థుల పాత్ర కీలకమైందన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన వివిధ నృత్యాలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో స్కిల్‌డవలప్‌మెంటు సీజీఎం హర్షద్, డాక్టర్ జయపూజిత, ప్రిన్సిపల్ నారాయణరావు, స్టూడెంటు అడ్వయిజరు ఎస్.వి.రమణ, సివిల్ హెడ్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ వి.మురళీకృష్ణ

14వ వార్డులో ఇది మంచి ప్రభుత్వం

గురుద్వారా, న్యూస్‌టుడే: ఉత్తర నియోజకవర్గం 14వ వార్డు తెదేపా నాయకురాలు హేమ ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. వార్డు అధ్యక్షులు గొంప ధర్మారావు, ఆర్.వసంతరావు, జనసేన పార్టీ అధ్యక్షులు కృష్ణ ఇంటింటికీ వెళ్లి వంద రోజుల పాలనలో తెదేపా ప్రభుత్వం అందించిన పథకాలపై ప్రజలకు అవగహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ సిబ్బంది, కూటమి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాల పంపిణీలో హేమ, వార్డు అధ్యక్షులు ధర్మారావు, వసంతరావు, తదితరులు

కలెక్టర్‌ను కలిసిన డ్వామా పీడీ

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) పథక సంచాలకులుగా డీఎల్‌డీఓ(జిల్లా స్థాయి అభివృద్ధి అధికారి) పూర్ణిమాదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆమె కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను కలిశారు. డ్వామా ద్వారా మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ ఆమెకు సూచించారు.



కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న పూర్ణిమాదేవి

పలు రైళ్లకు తాత్కాలికంగా అదనపు బోగీలు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పలు రైళ్లకు తాత్కాలికంగా అదనపు స్లీపర్, సాధారణ బోగీలు జత చేయనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

★ అక్టోబర్ 2, 11 తేదీల్లో భువనేశ్వర్-కేఎస్ఆర్ బెంగళూర్(18463), అక్టోబరు 3, 12 తేదీల్లో కేఎస్ఆర్ బెంగళూర్ - భువనేశ్వర్ (18463) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు ఒక స్లీపర్ బోగీ ★ అక్టోబరు 6 నుంచి నవంబరు 10 వరకు భువనేశ్వర్-తిరుపతి(22871), అక్టోబర్ 7 నుంచి నవంబరు 11 వరకు తిరుపతి-భువనేశ్వర్(22872) వారాంతపు రైళ్లకు ఒక సాధారణ రెండో తరగతి బోగీ ★ అక్టోబరు 1 నుంచి నవంబరు 5 వరకు భువనేశ్వర్-పుణె(22882), అక్టోబర్ 3 నుంచి నవంబరు 7 వరకు పుణె-భువనేశ్వర్(22881) వారాంతపు రైళ్లకు సాధారణ రెండో తరగతి బోగీ ★ అక్టోబరు 4 నుంచి 28 వరకు సంబల్‌పూర్-నాందేడ్(20809), అక్టోబర్ 5 నుంచి 29 వరకు నాందేడ్-సంబల్‌పూర్(20810) నాగావళి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఒక థర్డ్ ఎ.సి, ఒక స్లీపర్ బోగీ జత చేయనున్నట్లు తెలిపారు. ★ అక్టోబరు 2 నుంచి 30 వరకు సంబల్‌పూర్-ఈరోడ్(08311), అక్టోబరు 4 నుంచి నవంబరు 1 వరకు ఈరోడ్-సంబల్‌పూర్(08312) రైళ్లకు ఒక థర్డ్ ఎ.సి, ఒక స్లీపర్ బోగీ జత చేయనున్నట్లు తెలిపారు. ★ అక్టోబరు 1 నుంచి 31 వరకు విశాఖ-కిరండూల్-విశాఖ(08551-08552) రైళ్లకు ఒక స్లీపర్ బోగీ ★ అక్టోబరు 1 నుంచి 31 వరకు విశాఖ-గుణుపూర్-విశాఖ(08522-08521) రైళ్లకు ఒక స్లీపర్ బోగీ ★ అక్టోబరు 3 నుంచి నవంబరు 14 వరకు భువనేశ్వర్-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్(12830), అక్టోబరు 4 నుంచి నవంబరు 15 వరకు ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-భువనేశ్వర్(12829) రైళ్లకు ఒక సాధారణ బోగీ ★ అక్టోబరు 6 నుంచి నవంబరు 17 వరకు భువనేశ్వర్-ఎస్ఎంవీటీ బెంగళూర్(12845), అక్టోబరు 7 నుంచి నవంబరు 18 వరకు ఎస్ఎంవీటీ బెంగళూర్- భువనేశ్వర్ (12846) రైళ్లకు ఒక సాధారణ రెండో తరగతి బోగీ ★ అక్టోబరు 1 నుంచి నవంబరు 12 వరకు భువనేశ్వర్-పుదుచ్చేరి(12898), అక్టోబరు 2 నుంచి నవంబరు 13 వరకు పుదుచ్చేరి- భువనేశ్వర్ (12897) రైళ్లకు సాధారణ రెండో తరగతి బోగీ ★ అక్టోబరు 4 నుంచి నవంబరు 15 వరకు భువనేశ్వర్-రామేశ్వరం(20896), అక్టోబరు 6 నుంచి నవంబరు 17 వరకు రామేశ్వరం-భువనేశ్వర్(20895) రైళ్లకు ఒక సాధారణ రెండో తరగతి బోగీ జత చేయనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు గమనించి ఈ అదనపు బోగీలు సేవలు వినియోగించుకోవాలని కోరారు.

జలమయమైన లోతట్టు ప్రాంతాలు

అల్లిపురం, న్యూస్‌టుడే : నగరంలో గురువారం ఒక్కసారిగా కురిసిన వర్షానికి దక్షిణంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చావులమదుం వద్ద మూడు అడుగుల మేర వరదనీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలు ఇబ్బందులెదురయ్యాయి. హార్బర్ ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను కాన్వెంట్ కూడలి నుంచి రామకృష్ణ కూడలికి వెళ్లే మార్గం వైపునకు మళ్లించారు. 75 అడుగుల రహదారి, రామకృష్ణ కూడలిలో రెండు అడుగుల మేర వర్షపునీరు నిలిచిపోయింది.



చావులమదుం వంతెన కింద వరదలో నిలిచిపోయిన కారును నెడుతున్న దృశ్యం



రన్నర్స్‌గా నిలిచిన విశాఖ జట్టు

ముగిసిన ఉద్యోగుల వాలీబాల్ పోటీలు

రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాలలో జరుగుతున్న ఏపీ విద్యుత్తు శాఖ ఉద్యోగుల రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు గురువారంతో ముగిశాయి. ఇందులో డాక్టర్ ఎన్‌టీటీపీఎస్ విజయవాడ విజేతలుగా నిలిచారు. విశాఖపట్నం సర్కిల్ రన్నర్స్‌గా, ఆర్‌టీపీపీ కడప మూడోస్థానంలో నిలిచారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో విజేతలకు విద్యుత్‌శాఖ ఎస్ఈ తిలక్, ఏఈ శామ్యూల్ తదితరులు అందజేశారు. మొత్తం 16 జట్లు పాల్గొన్నాయి.

డీఆర్ఎం తనిఖీలు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: తూర్పు కోస్తా రైల్వే వాల్తేర్ డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ గురువారం విజయనగరం-రాయగడ సెక్షన్‌లో భద్రతా తనిఖీలు నిర్వహించారు. డివిజన్‌కు చెందిన ఇంజినీరింగ్, అపరేషన్, కమర్షియల్, భద్రత, మెకానికల్, సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్స్, ఎలక్ట్రికల్ విభాగాలకు సంబంధించిన ఉన్నతాధికారులతో కలిసి ఈ తనిఖీలు చేశారు. భద్రతా నియమాల అమలు తీరును పరిశీలించారు.



తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ చిరంజీవిరావుతో డాక్టర్ మమత చౌదరి

మైల్‌స్టోన్ గ్లోబల్ రన్నరప్‌గా మమత చౌదరి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: దుబాయి కేంద్రంగా ఈనెల 11 నుంచి 14 వరకు నిర్వహించిన మైల్‌స్టోన్ మిస్టర్ అండ్ మిసెస్ గ్లోబల్ ఈవెంట్ రన్నరప్‌గా విశాఖకు చెందిన మహిళ డాక్టర్ వై.మమత చౌదరి నిలిచారు. ఈమె గురువారం నగరంలోని తెదేపా కార్యాలయంలో మంత్రి లోకేశ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావును కలిశారు. ఈ సందర్భంగా వారు మమత చౌదరిని అభినందించారు.

వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సంప్రోక్షణ, శుద్ధి కార్యక్రమం

అల్లిపురం, న్యూస్‌టుడే : ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన దీక్షకు మద్దతుగా నియోజకవర్గంలోని అన్ని ఆలయాల్లో సంప్రోక్షణ, శుద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. అల్లిపురం దరి బలిగిరి వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సంప్రోక్షణ, శుద్ధి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలోని భాగంగా ఆలయ ధ్వజస్తంభం, వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. 34వ వార్డులోని శ్రీ రేణుకా ఎల్లమ్మతల్లి ఆలయంలో పూజాది కార్యక్రమాలను చేశారు. వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి, కూటమి నాయకులు విల్లూరి చక్రవర్తి, బంటుపల్లి సూర్యనారాయణ, వాసుపల్లి రామ్‌కుమార్ అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఆలయ ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

డీజే అనుమతి నిరాకరణపై నిరసన

గురుద్వారా, న్యూస్‌టుడే: దేవర చిత్రం విడుదల సందర్భంగా సంబరాలు చేసేందుకు సంగం శరత్ థియేటర్ దరి జూనియర్ ఎన్టీఆర్ అభిమానులకు పోలీసులకు మధ్య గురువారం రాత్రి స్వల్ప వాగ్వాదం జరిగింది. నృత్యాలు చేసుకునేందుకు డీజే పెట్టడానికి ప్రయత్నించగా అనుమతి లేదంటూ నాలుగో పట్టణ పోలీసులు నిరాకరించారు. దీంతో కొంత మంది అభిమానులు సమీపంలోని ఓవర్ బ్రిడ్జిపై నిరసనకు దిగారు. వారిని అదుపు చేసేందుకు నాలుగో పట్టణ, ద్వారకా, టూటౌన్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. సాయంత్రం ఆరు గంటల నుంచి 10 గంటల వరకు ఎలాంటి అనుమతి ఇవ్వలేదు. ఆ తర్వాత అభిమాన సంఘాల నాయకులు పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి అనుమతి తెచ్చుకోవడంతో వివాదం సద్దుమణిగింది. యథావిధిగా అభిమానులు ఎన్టీఆర్ పాటలకు నృత్యాలు చేసుకున్నారు.



థియేటర్ ఎదుట అభిమానులు, పోలీసులు

గాజువాక

•గాజువాక •విశాఖ పశ్చిమం

సెయిల్‌లో విలీనానికి విన్నపం


కేంద్రమంత్రి కుమారస్వామికి వినతి అందిస్తున్న గోవిందరావు

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-3): విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, పరిశ్రమలను సెయిల్‌లో విలీనం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎల్.గోవిందరావు కోరారు. గురువారం ఆయన దిల్లీలోని ఉద్యోగ భవన్‌లో కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసి వివిధ అంశాలపై వినతిపత్రం అందించారు. తెలుగు ప్రజల మనోభావాలను పరిగణలోకి తీసుకుని, సంస్థను పరిరక్షించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని, పరిశ్రమల్లో 75 శాతం ఉపాధి అవకాశాలు స్థానిక నిరుద్యోగులకే కల్పించాలని కోరారు. అన్నిరాష్ట్రాల్లో కులగణన చేపట్టాలని కోరారు. ఆయా సమస్యల పరిష్కారంపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని గోవిందరావు తెలిపారు.

'కేంద్రంపై ఒత్తిడి పెంచాలి'

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి ఉక్కు కర్మాగారం పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కృషి చేయాలని పోరాట కమిటీ నాయకుడు వి.శ్రీనివాసరావు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలో ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కొనసాగుతున్న దీక్షలు గురువారం 1323వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టు, అమరావతితో పాటు ఉక్కు కర్మాగారం పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉక్కులో పూర్తిస్థాయి ఉత్పత్తి సాధించేందుకు వీలుగా ముడిసరకు సమకూర్చాలన్నారు. శిబిరంలో జేఎంఎస్, డీటీయూ, వీఎస్ఈయూ, యూజ్ సంఘాల ప్రతినిధులు కూర్చున్నారు. పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మహాలక్ష్మినాయుడు, కె.పరంధామయ్య, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఏకేసీకాలనీ కూడలి కాలువలో..


జలమయమైన పాతగాజువాక సేవామార్గం


చినగంట్యాడలో...


ఆర్టీసీ లాజిస్టిక్ డిపో వద్ద..


ఏదురువానిపాలెంలో..


మల్కాపురం పోలీస్‌స్టేషన్ ఎదురుగా..

వాన జోరు.. పిడుగుల హోరు..!

- నీట మునిగిన రహదారులు
- లోతట్టు ప్రాంతాలు జలమయం

న్యూస్‌టుడే, గాజువాక, పెదగంట్యాడ, సింధియా, మల్కాపురం, అగనంపూడి


వాతావరణ మార్పులతో గురువారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంది. తొలుత చిరుజల్లులు ప్రారంభమై.. మధ్యాహ్నం ఒక్కసారిగా పిడుగుల మోతతో భారీ వర్షం కురిసింది. దీంతో గాజువాక, విశాఖ పశ్చిమం పారిశ్రామిక ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. రహదారులన్నీ జలమయమవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. లోతట్టు కాలనీలు నీట మునిగాయి. కొండవాలు ప్రాంత ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు.

ఇదీ పరిస్థితి..!: ఎక్కడికక్కడ మురికిగెడ్డలు పొంగి నీరంతా రహదారుల్లోకి చేరింది. తీవ్ర దుర్వాసనతో స్థానికులు అవస్థలు పడ్డారు.


అగనంపూడి ఆసుపత్రి ప్రాంగణంలో..

- జాతీయ రహదారి పంతులుగారిమేడ నుంచి శ్రామికనగర్ వెళ్లే సేవా మార్గంతో పాటు, 38 బస్టాపు పరిసరాల్లో పెద్ద ఎత్తున నీరు నిలిచింది.
- కుంచమాంబకాలనీ, చినగంట్యాడ సమీప లోతట్టు కాలనీల్లోకి వరద నీరు చేరడంతో నివాసితులు ఇళ్లలోంచి బయటకు రాలేకపోయారు.
- తోకాడ చెరువు నీరంతా పొంగి కుంచమాంబకాలనీ రోడ్డు నెంబరు-6, -9లోకి చేరింది.
- నడుపూరు ఉక్కు కళాక్షేత్రం క్రీడా మైదానం, గాజువాక ఆర్టీసీ లాజిస్టిక్ డిపో వద్ద బురద పేరుకుపోయింది. వినాయకనగర్ క్రీడా ప్రాంగణం చిత్తడిగా మారింది.
- అగనంపూడి ప్రాంతీయ ఆసుపత్రి ఆవరణ మొత్తం చిత్తడిగా మారడంతో రోగులు, సహాయకులు ఇబ్బంది పడ్డారు. ప్రధాన ప్రవేశ మార్గం బురదమయంగా మారింది. ప్రసూతి విభాగం వద్ద నీరు నిల్వ ఉండి చెరువును తలపించింది.


ప్రసూతి విభాగం వద్దకు చేరిన వరద



పారిశ్రామిక ప్రాంతంలో..: జీవీఎంసీ 58వ వార్డు ములగాడ, ఏదురువానిపాలెం రహదారులు ముంపునకు గురయ్యాయి. ఉదయాన్నే రోడ్డుపైకి చేరుకున్న దినసరి కూలీలు.. వర్షానికి పనులు లేక ఇంటిబాట పట్టారు. హెచ్‌పీసీఎల్, షిప్‌యార్డు తదితర సంస్థల్లో ఆరు బయట చేసే పనులకు ఆటంకం ఏర్పడింది.

- ఉదయం 11 గంటల నుంచి 12.30 గంటల వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి మల్కాపురం పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న సేవా రహదారిపైకి వరద నీరు చేరింది. నౌసేనాబాగ్ నేవీ క్వార్టర్స్ ముఖద్వారం నీట మునిగింది. ఏకేసీకాలనీ కూడలిలో ఉన్న మురుగు గెడ్డ స్తంభించడంతో... పారిశుద్ధ్య సిబ్బంది పూడికతీత పనులు చేపట్టారు.
- జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురం ప్రధాన రహదారితో పాటు పక్కనే ఉన్న కాలువ కొన్నాళ్ల కిందట ధ్వంసమవడంతో.. మురుగంతా రోడ్డుపై ప్రవహించింది.

మంత్రి లోకేశ్‌కు ఆత్మీయ వీడ్కోలు


మంత్రి నారా లోకేశ్‌తో మాట్లాడుతున్న తెదేపా నాయకులు

ఎన్ఏడీకూడలి(కాకానినగర్), న్యూస్‌టుడే: విశాఖ పర్యటన ముగించుకున్న రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ గురువారం సాయంత్రం విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు తెదేపా రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యే పి.గణబాబు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్‌గోపాల్, తెదేపా నాయకులు గండి బాబ్జి, నజీర్, కృష్ణ, నాగజగదీశ్వరరావు తదితరులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. అనంతరం మంత్రి గన్నవరం బయలుదేరారు.

మల్కాపురం, న్యూస్‌టుడే : పారిశ్రామిక ప్రాంతానికి చెందిన నాయీబ్రాహ్మణ బీసీ సాధికార సమితి సభ్యుడు జి.కరుణాకర్ గురువారం మంత్రి లోకేశ్‌ను కలిశారు. నాయీబ్రాహ్మణులకు సంబంధించిన పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. మరో సభ్యుడు డి.రమేష్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, గాజువాక, సింధియా

సమస్య : గాజువాక బీసీరోడ్డు పోర్టు వంతెనపై పశువులు తిష్ఠ వేస్తూ వాహనచోదకులకు ఇబ్బంది కలిగిస్తున్నాయి.
–శ్రీనివాస్, పెదగంట్యాడ

సమాధానం: సిబ్బందిని పంపి... తగిన చర్యలు తీసుకుంటాం.
–డాక్టర్ కిరణ్‌కుమార్, ఏఎంఓహెచ్

?: పాత గాజువాక పంతులుగారి మేడ వద్ద ఎంజీ33ఎ-4-6 స్తంభంపై వీధి దీపం 2 నెలలుగా వెలగడం లేదు. అగనంపూడి సాయినగర్‌కాలనీలో ఎస్ఎస్ 24బీ-4 స్తంభంపై దీపం పడకేసింది. –తేజేశ్వరరావు, పంతులుగారి మేడ
–కె.సురేష్‌కుమార్, అగనంపూడి

✔: మరమ్మతులకు గురైన దీపాలను పునరుద్ధరిస్తాం. –శివ, వీధి దీపాల నిర్వహకుడు

?: మల్కాపురంలో వీధి దీపాలు వెలగడం లేదు. – డొక్కా సన్యాసిరావు

✔: సిబ్బందిని పంపి దీపాలు బాగు చేయిస్తాం. – శ్రీనివాసరావు, వీధి దీపాల నిర్వాహకుడు

దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్లు

పశ్చిమంలో ముగిసిన 'ఇది మంచి ప్రభుత్వం'


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా, వేదికపై కార్పొరేటర్ లేళ్ల

గోపాలపట్నం(ఆర్.ఆర్.వి.పురం), న్యూస్‌టుడే: జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురం మూడుగుళ్ల వద్ద గురువారం 'ఇది మంచి ప్రభుత్వం' ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికుల్ని సన్మానించారు. గోపాలపట్నం మండల తహసీల్దార్ రమేశ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 86వ వార్డు రాసాలమ్మకాలనీలో గురువారం కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు అధ్యక్షతన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. కూటమి నాయకులు సూర్యనారాయణ, ఎం.కనకరాజు, వి.శ్రీనివాసరావు, కె.ఈశ్వరరావు, నాయుడు, గంధం వెంకటరావు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 87వ వార్డులో కార్పొరేటర్ బొండా జగన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కూటమి నాయకులు సోంబాబు, విజయరామరాజు, రాజన్‌రాజు, డీవీ.అప్పారావు, కె.కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్, గుడివాడ అప్పన్నకాలనీల్లో గురువారం 'ఇది మంచి ప్రభుత్వం' పేరిట కరపత్రాలు పంపిణీ చేశారు. వార్డు తెదేపా అధ్యక్షులు మజ్జి మాలినాయుడు, నాయకుడు నర్సింగరావు, సచివాలయం కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

"అర్హులైన మహిళలకు దీపావళి పండక్కి ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తాం. 100 రోజుల కూటమి ప్రభుత్వ పాలనపై సమాజంలో అన్ని వర్గాలు సంతృప్తికరంగా ఉన్నాయి. ఎల్జీ పాలిమర్స్ బాధితులందరికీ పరిహారం అందుతుంది. త్వరలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అందుబాటులోకి వస్తుంది. ప్రభుత్వ పథకాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలి."
–పి.గణబాబు, ఎమ్మెల్యే

"వంద రోజుల పాలనలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించాం. సూపర్ సిక్స్‌లో మిగిలిన పథకాల అమలుకు కార్యాచరణ సిద్ధమైంది. తిరుపతి లడ్డూ తయారీలో నాసిరకం నెయ్యి వినియోగించి, భక్తుల మనోభావాలు దెబ్బతీసిన వైకాపాను ప్రజలు అసహ్యించుకుంటున్నారు. వైకాపా అరాచక పాలనలో విసిగిపోయిన ప్రజలు కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో ఉపశమనం పొందుతున్నారు."
–పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే


వెంకటాపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

శరన్నవరాత్రుల రాటోత్సవం


గుడివాడ అప్పన్నకాలనీలో పూజలు చేస్తున్న భక్తులు

మల్కాపురం, న్యూస్‌టుడే : శ్రీ కనకదుర్గాదేవి శరన్నవరాత్రులను పురస్కరించుకుని గురువారం 62వ వార్డు గుడివాడ అప్పన్నకాలనీలో యంగ్ వండర్స్ అండ్ వన్ వే బాయ్స్ ఆధ్వర్యంలో రాటోత్సవం నిర్వహించారు. వార్డు తెదేపా అధ్యక్షులు మజ్జి మాలినాయుడు, కూటమి నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు, యూత్ కమిటీ సభ్యులు పాల్గొని పూజలు చేశారు.

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : పెదగంట్యాడ సీతానగరం ఎన్టీఆర్ కూడలిలో దుర్గమాంబ ఆటోస్టాండ్ వద్ద నవరాత్రి ఉత్సవాల ఉడుపు రాట వేడుక గురువారం నిర్వహించారు. తెదేపా నగర ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు రమణబాబు, అప్పారావు, ఈశ్వరరావు, పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

▼ లడ్డూ ప్రసాదం అందజేత

గాజువాక, న్యూస్‌టుడే : గాజువాక శ్రీనగర్‌లో భారీ గణపతికి నివేదించిన 20 కిలోల లడ్డూ ప్రసాదాన్ని ఉత్సవ కమిటీ ప్రతినిధులు గురువారం తాడేపల్లి వైకాపా కార్యాలయంలో మాజీ సీఎం జగన్‌కు అందజేశారు. 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, కమిటీ సభ్యులు గణేశ్, జీలకర్ర నగేంద్ర పాల్గొన్నారు.

▼ 'లడ్డూ నాణ్యతపై నిగ్గు తేల్చండి'

సింధియా, న్యూస్‌టుడే : తిరుమల లడ్డూ నాణ్యతపై నిగ్గు తేల్చాలని 58వ వార్డు తెదేపా అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం వార్డులో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ అంశంలో ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలన్నారు. అలాగే వార్డులో కోరమాండల్ కాలుష్య తీవ్రత పెరుగుతుందని, నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు.

▼ మోసం కేసులో నిందితుడి అరెస్టు

గాజువాక, న్యూస్‌టుడే : ఆన్‌లైన్ ట్రేడింగ్ వ్యాపారం పేరిట పలువురిని మోసం చేసిన నిందితుడిని గురువారం గాజువాక పోలీసులు అరెస్టు చేశారు. ఆ వివరాలు.. వుడాకాలనీకి చెందిన ఎన్.శ్రీనివాసరావు(53) ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయని పలువురిని నమ్మించి వివిధ డిపాజిట్ స్కీముల్లో సభ్యులుగా చేర్పించాడు. కొద్ది రోజుల నుంచి శ్రీనివాసరావు ముఖం చాటేయడంతో ఖాతాదారులంతా పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

▼ ఆకట్టుకున్న అన్నమయ్య కచేరి

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి పరిధి శాంతినగర్ కాలనీ శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఏర్పాటు చేసిన వసుంధర బృందం అన్నమయ్య కచేరి ఆకట్టుకుంది. ఆలయ ధర్మకర్త ఇ.కె.చారి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గాజువాక సినిమాలు..

కన్య, శ్రీకన్య., మినీమోహినీ, అరుణ (పెదగంట్యాడ): అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), మోహినీ, లక్ష్మీకాంత్, విశేష్, మోహినీ 70ఎంఎం, లక్ష్మి: **దేవర**

గోపాలపట్నంలో..: శ్రీనరసింహ, నరసింహ, సౌజన్య, సుకన్య, మౌర్య: **దేవర**

ఎస్టీబీఎల్‌లో..: స్క్రీన్-2, స్క్రీన్-3, స్క్రీన్-4: **దేవర**

తాగునీరు అందించాలి

సింధియా, న్యూస్‌టుడే : పారిశ్రామిక ప్రాంతం కొండవాలు పరిసరాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని 60వ వార్డు కార్పొరేటర్ పీవీ.సురేష్ కోరారు. గురువారం జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఆయన పలు సమస్యలు ప్రస్తావించారు.

సందడే.. సందడి

గాజువాక, న్యూస్‌టుడే : జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర సినిమా శుక్రవారం విడుదలవుతున్న సందర్భంగా గురువారం రాత్రి గాజువాక కన్య థియేటర్ వద్ద అభిమానులు సందడి చేశారు. డీజే పాటలతో, బాణసంచా కాల్చి నృత్యాలు చేశారు.


కన్య థియేటర్ వద్ద అభిమానుల కోలాహలం

ఆలయ కమిటీ సమస్య పరిష్కారం


నగర పోలీసు కమిషనర్‌ను సత్కరిస్తున్న అర్చకులు

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి పరిధి పెదమడక కాలనీ శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయ కమిటీ సమస్య పరిష్కరించిన నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీని గురువారం అర్చకులు సత్కరించారు. ఇటీవల కమిటీ సభ్యుల్లో తలెత్తిన వివాదం కారణంగా అర్చకుడికి వేతనం చెల్లించకపోవడంతో ఆయన కుటుంబంతో సహా నిరసన తెలిపారు. ఈ విషయాన్ని స్థానిక స.హ.కార్యకర్త పట్టా రామఅప్పారావు పోలీసు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కమిషనర్ ఫోన్ ద్వారా కాలనీ నాయకులతో మాట్లాడి అర్చకుడికి వేతనం చెల్లింపుతో పాటు, ఆలయానికి నూతన కమిటీ ఏర్పాటయ్యేలా కృషి చేశారు. దీంతో ఆలయ అర్చకుడు పల్లంరాజు శర్మ, ప్రజా సంఘాల నాయకులు ఎన్.రమేష్ తదితరులు సీపీని కలిసి ధన్యవాదాలు తెలిపారు.

విద్యా ప్రమాణాలకు పెద్దపీట

గాజువాక, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగునకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. గురువారం గాజువాక జెడ్పీ ఉన్నత పాఠశాలలో కోరమాండల్ సంస్థ సీఎస్సార్ నిధులు రూ.8 లక్షలతో ఏర్పాటు చేసిన సైన్స్‌ల్యాబ్‌ను ఆయన డీఈఓ చంద్రకళతో కలిసి ప్రారంభించారు. డీఈఓ మాట్లాడుతూ... విద్యార్థుల నైపుణ్యాలు మెరుగు పర్చుకోవడానికి సైన్స్ ల్యాబ్ ఉపకరిస్తుందన్నారు. 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. కోరమాండల్ వైస్ ప్రెసిడెంట్ జ్ఞానసుందరం, స్థానిక నాయకులు నరసింహపాత్రుడు, చినతల్లి, నర్సింగరావు, శంకరరావు, వాసు, అనంత్, పాఠశాల హెచ్ఎం విజయప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.


గాజువాకలో సైన్స్ ప్రయోగశాల ప్రారంభిస్తున్న డీఈఓ చంద్రకళ, తదితరులు

ఉచిత కంటి వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం(షీలానగర్), న్యూస్‌టుడే: షీలానగర్‌లోని విశాఖ డెయిరీ పాఠశాలలో విద్యార్థులు గురువారం కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కిమ్స్ ఆసుపత్రి కంటి వైద్య విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యురాలు కేవీఎస్ఆర్.సంధ్య పర్యవేక్షణలో నేత్ర సంరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్ఎం జి.కరుణకుమారి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అక్టోబర్ 9న విజయవాడలో ధర్నా

గురుద్వారా, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుల గణన చేపట్టాలని కోరుతూ విజయవాడలో అక్టోబర్ 9న నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ విశాఖపట్నం అధ్యక్షులు పెదపెంకి శివప్రసాదరావు పిలుపునిచ్చారు. గురువారం సీతమ్మధార పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ధర్నా కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ బీసీ నాయకులు కట్టా మల్లేశ్వరరావు, పార్టీ ప్రధాన కార్యదర్శి అన్వేశ్, ధనుంజయరావు, ఉపాధ్యక్షులు రామచంద్రరావు, కోశాధికారి కనకమహాలక్ష్మి, ఉత్తరం సమన్వయకర్త రమేశ్, కార్యదర్శి తాతారావు, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

30న మహాధర్నా : సిటూ

సింధియా(నెహ్రూనగర్), న్యూస్‌టుడే : ఒప్పంద, పొరుగు సేవల కార్మికుల్ని క్రమబద్ధీకరించడంతో పాటు, ఇతర పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 30న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మహాధర్నా చేపట్టనున్నామని మల్కాపురం జోన్ సిటూ కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి అన్నారు. గురువారం ఉదయం 58, 59, 60వ వార్డులకు చెందిన ఒప్పంద కార్మికులు గుల్లలపాలెం మార్కెట్ వద్ద చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ సంస్థల్లో పని చేస్తున్న కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలన్నారు. సిటూ నాయకులు కె.రమణ, బి.రాంబాబు, డి.రాము, సూరిబాబు, రైలుబాబు పాల్గొన్నారు.


గుల్లలపాలెం మార్కెట్ వద్ద సిటూ సభ్యుల నిరసన

ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శన


వివిధ రకాల ప్రాజెక్టులతో విద్యార్థులు; నమూనాలు పరిశీలిస్తున్న గంటా శారద, పాఠశాల డైరెక్టర్ రాజ్యలక్ష్మి

కరాస, న్యూస్‌టుడే : విద్యార్థులు ఆసక్తి ఉన్న అంశంలో నైపుణ్యాలు మెరుగు పరుచుకుంటే.. భవిష్యత్తులో ఎన్నో అవకాశాలు దక్కుతాయని హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు గంటా శారద అన్నారు. జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడాలేఅవుట్‌లోని నవ్యాంధ్ర పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ నమూనాలను పరిశీలించి, బాలల ప్రతిభను మెచ్చుకున్నారు. పాఠశాల డైరెక్టర్ కె.రాజ్యలక్ష్మి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాలువ నిర్మాణానికి శంకుస్థాపన

గోపాలపట్నం(కొత్తపాలెం), న్యూస్‌టుడే : జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెంలో వరద నీటి కాలువ నిర్మాణానికి గురువారం వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.39.82 లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టే నిర్మాణ పనుల్ని త్వరితగతిన పూర్తి చేసి, కాలువను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ హైమావతి, వార్డు తెదేపా అధ్యక్షుడు బొడ్డేటి విజయ్‌కుమార్, ప్రజా పనుల విభాగం ఏఈ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


శిలాఫలకం ఆవిష్కరించిన దృశ్యం

ప్రజా భాగస్వామ్యంతో స్వచ్ఛత సాధ్యం


ర్యాలీలో పాల్గొన్న ఎన్ఎస్‌టీఎల్ ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులు

ఎన్ఏడీకూడలి(బుచ్చిరాజుపాలెం),: ప్రజా భాగస్వామ్యంతో స్వచ్ఛత సాధ్యమని ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ అబ్రహాం వర్గీస్ పేర్కొన్నారు. గురువారం స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా ఎన్ఏడీకూడలి సమీప సంస్థలో 'స్వభావ స్వచ్ఛత- సంస్కార్ స్వచ్ఛత' వారోత్సవాలు ప్రారంభించారు. ముందుగా ఉద్యోగులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించి, పరిసరాలు శుభ్రం చేశారు. అనంతరం స్వచ్ఛ ర్యాలీ చేపట్టి, పారిశుద్ధ్య కార్మికులకు కిట్లు పంపిణీ చేశారు. శాస్త్రవేత్తలు సత్యశ్రీనివాస్, మిథిలేశ్‌కుమార్ సాహు, కల్నల్ రాహుల్ దీక్షిత్ పాల్గొన్నారు.

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-8), న్యూస్‌టుడే : ఉక్కుగనరం డీపాల్ పాఠశాలలో గురువారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపల్ డాక్టర్ అనీష్‌మాథ్యూ మాట్లాడుతూ... విద్యార్థి దశ నుంచే స్వచ్ఛతపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేసి మొక్కలు నాటారు. వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ సాజీ పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న డీపాల్ పాఠశాల విద్యార్థులు



దర్పణం

పారిశ్రామిక ప్రాంతం నుంచి పాయారాడ వెళ్లే రహదారి నిత్యం రద్దీగా ఉంటోంది. రాత్రి సమయంలో వీధి దీపాలు వెలగకపోవడంతో రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే సమయంలో ఆకతాయిల ఆగడాలు ఎక్కువవడంతో మహిళలు, యువతులు ప్రయాణానికి బెంబేలెత్తిపోతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు ఫిర్యాదులు చేసినా.. ఎవరూ పట్టించుకోవడం లేదని వారు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దీపాలు వెలిగించాలని, పోలీసులు స్పందించి ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, మల్కాపురం